శ్రీరస్తు

ప్రజాకవులు

# అన్నమయ్య - వేమన

(తులనాత్మక పరిశీలన)

రచయిత :-

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో

ముద్రితము

1988

శ్రీరస్తు

# ప్రజాకవులు
# అన్నమయ్య - వేమన

(తులనాత్మక పరిశీలన)


ర చ యి త :-

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
తిరుపతి



తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో
ముద్రితము

**1988**

ప్రథమ ముద్రణ : వినాయక చతుర్థి, 1988
ప్రతులు 1000
వెల :- రు 10-00

ప్రతులకు : జె. బాలసుబ్రహ్మణ్యం
డి-93, వినాయక నగరు,
తి.తి. దేవస్థానం క్వార్టర్సు,
తిరుపతి - 517507.

ముద్రణ : చంద్రమౌళి ప్రింటర్స్,
105, ప్రకాశం రోడ్డు,
తిరుపతి - 517501.

# అంకితం

"దేవు దేవుఁ డితఁడే దివ్య మూరితి
యేవలఁ జూచినఁ దానే యీరూపై వున్నాఁడు"

అని సర్వదేవతా స్వరూపుడైన శ్రీవేంకటేశ్వరుని పరబ్రహ్మ తత్త్వాన్ని చాటిన యోగీశ్వరుడు అన్నమయ్యకు—



"శైవ వైష్ణవాది షణ్మతంబుల కెల్ల
దేవుడొక్క డనుచు దెలియ లేరు"

అని విమర్శనాత్మకంగా అఖండ శివ కేశవాభేద పరబ్రహ్మ తత్త్వాన్ని చాటిన వేమన్న యోగికి—

యోగీశ్వరుడైన శ్రీవేంకట ప్రభువుల శ్రీచరణ సన్నిధానానకు—

భక్త్యంజలులతో

అంకితము


*Published*

with the Financial Assitance of

**TIRUMALA TIRUPATI DEVASTHANAMS**

Under their Scheme

Aid to Publish Religious Books

# ముందుమాట

ఇరువురు ఆధ్యాత్మిక కవియోగులు తాళ్ళపాక అన్నమయ్య, వేమన్నల సాహిత్యాల్ని సంక్షిప్తంగా, తులనాత్మకంగా పరిశీలించబడిన చిన్న పుస్తకమే ఈ "ప్రజాకవులు అన్నమయ్య - వేమన్న"

ఒకే ప్రాంతానికి చెందిన కవులిద్దరిలో, ఒకరి ప్రభావం మరొకరిపై ఉండనడం కంటే కూడ, వీరిద్దరిపై ప్రజాబాహుళ్య ప్రభావం విస్తృతంగా ఉందని ఘంటా పథంగా చెప్పవచ్చు. కనుకనే ప్రజా వ్యవహారంలో సజీవంగా వున్న భావాల్ని, పలుకు బళ్ళు, నానుళ్ళు, ఇత్యాది భాషా విశేషాల్ని స్వీకరించారు. అభ్యుదయ గాములైన ఈ కవులు ఆధ్యాత్మిక పథం వైపు పురోగమించారు. ఆ మార్గంలో చెడును తుంచుకుంటూ, మంచిని పెంచుకుంటూ, జన జీవన స్రవంతిలో నూతన చైతన్యాన్ని, దీప్తినీ కలిగించిన ప్రతిభా మూర్తులూ, ప్రజాకవులు ఒకరు అన్నమయ్య మరొకరు వేమన్న.

కనుకనే వీరిద్దరి సాహిత్యంలో చాల దగ్గరి పోలిక లున్నాయి. ఆ సామ్యాల్ని సోదాహరణంగా ఇందులో క్లుప్తంగా విమర్శించడం జరిగింది.

1983 అన్నమయ్య వర్ధంతి ఉత్సవాల్లో అన్నమయ్య - వేమన్న లిరువురు సాహిత్యాల్ని గూర్చి తులనాత్మకంగా పరిశీలించి ప్రసంగించ వలసిందని నన్నాదేశించి, ఆశీర్వదించిన పూజ్య గురువర్యులు శ్రీగౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారికి నా భక్త్యంజలులు.

1983 ఏప్రిల్లో జరిగిన అన్నమయ్య వర్ధంత్యుత్సవానికి అధ్యక్ష స్థానంలో వుండి, నా ఈ ప్రసంగ వ్యాసాన్ని మనసార అభినందించిన సహృదయ వరేణ్యులు డా॥ రావుల సూర్యనారాయణ మూర్తి గారికి నా కృతజ్ఞతాంజలులు.

దీనినే ప్రసంగ వ్యాసంగా ప్రసార భాగ్యం కలిగించిన ఆకాశవాణి కడప వారికి కృతజ్ఞతాంజలి.

ఈ వ్యాసాన్ని పుస్తక రూపంలో ముద్రించి ప్రచురింప వలసిందని అమూల్యమైన సలహా నొసంగి చక్కని ప్రోత్సాహము లిచ్చిన సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు గారికి, తి.తి. దేవస్థాన అన్నమాచార్య ప్రాజెక్టు అధికారి అవధాన చక్రవర్తి డా॥ మేడసాని మోహన్ గారికి నా నమస్సుమాంజలులు.

ఈ పుస్తక ముద్రణకై ఆదరణతో ఆర్థిక సహాయం చేసిన తి.తి. దేవస్థాన కార్య నిర్వాహకులు శ్రీ సి. హెచ్. వెంకటపతి రాజు, ఐ.ఎ.యస్. గారికి నా భక్త్యంజలులు.

ఈ పుస్తక రచనలో ఉపయుక్తములైన ఆయా గ్రంథాల రచయితలకు, పరిష్కర్తలకు నా కృతజ్ఞతాంజలులు.

సకాలంలో ముద్రించి ఇచ్చిన చంద్రమౌళి ప్రింటర్స్ యజమాని శ్రీ ఎ. మోహన్ గారికి, వారి సిబ్బందికి నా కృతజ్ఞతాంజలి.

నా యీ ప్రయత్నంలో ఎన్నో తప్పులు దొరలి వుండవచ్చు. సహృదయులు మన్నించి ఎత్తి చూపినచో, విధేయతతో స్వీకరించి సవరించు కొందునని ప్రార్థన.

"అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీ వేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదము లన్నియు, మంచి
పదములు సేసి పాడి పావనము సేసెను"

"వేదా తీతుడు వేమనరా!
వేమన మాటలు వేదమురా!!"

వినాయక చతుర్థి, రచయిత

15, సెప్టెంబరు, 1988. జూలకంటి బాలసుబ్రహ్మణ్యం,

తిరుపతి.

శ్రీరామజయం

వేదంబులు! పౌరాణిక
వాదంబులు! వరకవిత్వవాణీవీణా
నాదంబులు! కృతసుజనా
హ్లాదంబులు! తాళ్లపాక అన్నయ పదముల్!!

— చిన తిరుమలాచార్యులు.

వేమన చెప్పినమాటలు
సామంబున సకల వేదసారంబు గదా!
ఆమెత పంచాక్షరిలో
నీ మహిమను తెలియకున్న ఇంపా వేమా!!

— వేమన శిష్యుడు

ఏ యుగంలోనైనా తమ కవితా ప్రవంతిద్వారా మానవ సమాజాన్ని జాగృతంచేసి, ప్రజల్లో నవచైతన్యాన్ని కలిగించి, వారిని శివంకరమైన, సుందరమైన, సత్యమైన శాశ్వత లక్ష్యం వైపు పురోగమించేటట్లు చేసేవారు మహాకవులు. వాళ్లే ఋషితుల్యులు. అట్టి మహనీయులైన మహాకవుల రచనల్లో, భావాల్లో, వారికి తెలియకుండానే అవధుల్లేని జాతీయత, సార్వజనీనత, సార్వకాలికత స్పష్టంగా గోచరిస్తూ వుంటాయి. ఆంధ్రభూమిలో అవతరించిన అట్టి మహాకవుల్లో అగ్రగణ్యులైన ప్రజాకవులూ, అధ్యాత్మ కవియోగులు ఒకరు తాళ్లపాక అన్నమయ్య- మరొకరు వేమనయోగి.

ఒకరు 'సర్వమంత్రరహస్యోద్భావనములైన పదకవితల ద్వారా శ్రీవేంకటేశ్వర భక్తి ప్రచారోద్యమానికి పూనుకొన్నవారు. తిరుమల మొదలుకొని, ఊరూరా, వాడవాడలా దేవుడు మెచ్చునట్లుగ, లోకము మెచ్చునట్లుగ త్రికరణశుద్ధిగ వేంకటేశ్వరునిపై పదాలను అల్లి ప్రచారము చేసినారు. ఆయా ఊళ్లలోని దేవుళ్లను వేనోళ్ల కీర్తించి ఆ దేవుళ్లందరిలోనూ వేనామాల వెన్నుని దర్శించిన ధన్యజీవి అన్నమయ్య. అన్నమయ్య దృష్టిలో 'వినా వేంకటేశం న నాథో న నాథః.' అందులకే ఏకత్వంలో భిన్నత్వాన్ని భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపించినాడు. ఈ సంకీర్తనాచార్యుడు పరమభక్తుడై వేంకటపతి మీద వింత వింతలుగ ముప్పది రెండువేల కీర్తనములను పాడినాడు.

మరొకరు 'విశ్వ దాభి రామ వినురవేమ' అనే మకుట పద్యాలద్వారా అఖండ శివకేశవాభేద పరబ్రహ్మతత్త్వాన్ని చాటూతూ మానవతావాదిగా నిల్చి నిర్మొహమాటంగా, జాతిలోని తెలుపు నలుపుల్ని విమర్శించి ప్రజా హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్న సాహిత్యమూర్తి. "యోగవిద్య నభ్యసించి, తత్త్వమెరిగి మూగనోముతో మూల కూర్చుండక తాను సాధించిన విద్యను, అనుభవించిన ఆధ్యాత్మిక రసానుభూతిని లోకులకు సమపంక్తిలో వడ్డించిన మర్మయోగి ఈ పల్లెటూరు కాపు. ఈ నూతన ప్రవక్తకు గ్రామీణ జీవనమే పాది. ఆంధ్రవాఙ్మయమున ఈతని స్థానము-తమిళమున వైష్ణవ ఆళ్వారులు - శైవనాయనమారుల స్థానము వంటిదే! వారిలో హాస్యము తక్కువ. వేమనలో ఎక్కువ-ఇంతే వార!! తిరుకురళ్ వ్రాసిన తిరువళ్లువరు యీయన సరిఊద్ది" అను కళాప్రపూర్ణ డా॥ మరుపూరి కోదండరామరెడ్డిగారి ("వేమన" చైతన్య లహరి, యువభారతి ప్రచురణ.) పలుకులు ప్రత్యక్షర సత్యాలు.

తెనుగుతల్లి అనుగు బిడ్డలైన ఈ ఇద్దరు కవులూ తెలుగునేల నాలుగు చెరగులా తమ కవితా వ్యవసాయంచేత సస్యశ్యామలం చేసిన కవి కృషీవలులే.

ఆధ్యాత్మిక పథంలో పయనించిన ఈ అధ్యాత్మ కవియోగులిరు వురి యొక్క సాహిత్యాల్ని తులనాత్మక దృష్టితో సంక్షేపంగా సమీక్షించ దంలో ముందు వీరిరువురి జన్మకాలాన్ని పరిశీలిద్దాం.

## జననం

ఈ ఇరువురి మహాకవుల జననం పూర్ణిమ తిథియందు సంభవించి నది. అన్నమయ్య

"చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర
అనుపమ లగ్నంబునందు వైశాఖ-
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు...."

అని అన్నమాచార్య చరిత్రలో పేర్కొన బడినది. కాని అన్నమయ్య జననం విరోధి వైశాఖమాసంలోనని కొందరూ, క్రోధి వైశాఖంలోనని కొందరి విమర్శకుల వాదాలున్నాయి.

ఇక వేమన జననం నందన సంవత్సరం ఆశ్వయుజ శుద్ధపౌర్ణమిగా

"నందన సంవత్సరమున
పొందుగ నాశ్వీజ శుద్ధ పున్నమ నాడా
బృందారకాది సీతువు
సందున నొక వీరవరుని జననము వేమా!

అను కందం ద్వారా తెలియవస్తున్నది. కాని వేమన్న జననం నందన సంవత్సరం అయినా, పలానా నందన అని విమర్శకులు నిర్ణయించ లేకున్నారు.

# కాలం

ఈ ఇరువురి కాలాన్ని గురించి పలు రకాలయిన అభిప్రాయ భేదా లున్నాయి. మొదట అన్నమయ్యను గురించి పరిశీలిద్దాం.

## అన్నమయ్య కాలం :

అన్నమయ్యకాల నిర్ణయం గురించి ప్రధానంగా రెండు వాదా లున్నాయి. అందులో మొదటివాదం క్రీ. శ. 1408 నుండి 1503 కాలం నాటివాదని కీ॥ శే॥ శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, కీ॥ శే॥ చాగంటి శేషయ్య అన్నమాచార్య వాఙ్మయ పరిష్కరణాధికారి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, ఆచార్య జి. యన్. రెడ్డి మున్నగువారు నిర్ణయించారు.

అన్నమాచార్యుల కాలం క్రీ. శ. 1424 నుండి 1503 అనీ రెండవ వాదం. ఈ వాదాన్ని చేసి నిర్ణయించిన వారిలో కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి, డా॥ ముట్నూరి సంగమేశం, డా॥ వేటూరి ఆనందమూర్తి ముఖ్యులు. కాని విశేషమేమంటే పై రెండు వాదాల్లో అన్నమయ్య స్వర్గ స్థుడైన తేదీలో మాత్రం ఏకాభిప్రాయం కనపడుతున్నది.

పై రెండు వాదాల్లోను, రాగిరేకులలోని ఆధారాలను బట్టి చాలా మంది పై మొదటి వాదమే సహేతుకమైనదిగా నిర్ణయించినారు. అనగా అన్నమయ్య జననం క్రీ. శ. 1408 అనీ, అది విరోధి సంవత్సరమనీ సారాంశం. తి. తి. దేవస్థానమువారు కూడ పై మొదటి వాదాన్నీ, రేకుల పై వున్న వ్రాతనూ, ఆధారంగా స్వీకరించి అన్నమయ్య జయంత్యు త్సవాలు జరుపుతున్నారు.

## వేమన్న కాలం :

వేమన్నకాల నిర్ణయం గురించి గమనించినట్లయితే చాలావాదా లున్నట్లు స్పష్టమవుతుంది. ప్రధానంగా వాటిని 1. పాశ్చాత్యుల వాదం. 2. ప్రాచ్యుల వాదం ( దేశీయుల ) అని నిర్ణయించి పరిశీలించవచ్చు.

## 1. పాశ్చాత్యుల వాదం :

మొట్ట మొదట 1792 నుండి 1823 వరకు భారతదేశంలో సంచరించిన ఫ్రెంచి మతగురువు జె. ఎ. దుబాయ్, వేమన్న 17వ శతాబ్ది చివర మరణించినట్లు

"We are told that the philosopher who was of the Reddy caste and was born in the district of Cuddapah, died towards the end of the Seventeenth century" అని

"Hindu Manners, Customs and Cermonies" అను గ్రంథంలో పేర్కొన్నాడు.

1816లో భారతభూమిలో అడుగుపెట్టిన C. P. బ్రౌన్, వేమన్న జననం క్రీ. శ. 1652 అని ఈ క్రింది పద్యం ఆధారంగా నిర్ణయించాడు.

నందన సంవత్సరమున
పొందుగ నాశ్వీజ శుద్ధ పున్నమ నాడా
బృందార కాద్రి సీతువు
సందున నొక వీర వరుని జననము వేమా !

1866లో మేజర్ R. M. మ్యాగ్డొనాల్డ్, బ్రౌన్ చెప్పిన కాలంతో ఏకీభవించాడు. తర్వాత 1871లో సి. వి. గోవర్ అను ఆంగ్ల భాషాపండితుడు తమిళకవి తిరువళ్లువరుతో వేమన్నను పోలుస్తూ వేమన్న కాలం 12వ శతాబ్దమని నిర్ణయించాడు.

## 2. దేశీయుల వాదం :

పూర్ణయాచారి 'వేమనయోగీంద్ర చరిత్రము' అను తన గ్రంథంలో వేమన 15వ శతాబ్దం వాడని నిర్ణయించారు. కాని ఈ వాదాన్ని కొమఱ్ఱాజు లక్ష్మణరావు ఖండించారు. ఇంకా

వంగూరి సుబ్బారావు — క్రీ. శ. 1412-1480
శేషాద్రి రమణ కవులు — క్రీ. శ. 1460-1600
వేదం వేంకట కృష్ణశర్మ — క్రీ. శ. 1565-1625
వేటూరి ప్రభాకర శాస్త్రి — క్రీ. శ. 1650
బండారు తమ్మయ్య — క్రీ. శ. 1652-1725
రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ — క్రీ. శ. 1700

పై విధంగా పలువురు పరిశోధకులు నిర్ణయించారు. కాని వేమనపై పరిశోధన చేసిన డా॥ ఎన్. గోపి ఇటు పాశ్చాత్యుల వాదాలు, అటు దేశీయుల నిర్ణయాలను పరిశీలించి, ప్రాచీన తాళపత్రాల ఆధారంగా క్రీ.శ 1650 ప్రాంతమే వేమనగారి కాలం అని నిగ్గుతేల్చి చెప్పారు. ఇది సరిగ్గా C. P. బ్రౌన్ నిర్ణయించిన కాలమే అని స్పష్టంగా చెప్పవచ్చు.

దీనిని ఆధారంగా స్వీకరించే భారతప్రభుత్వంవారు కూడా 1652 అక్టోబర్, వేమన్న జనన సంవత్సరంగా నిర్ణయించి 1972 అక్టోబర్‌లో వేమన త్రిశత జయంత్యుత్సవాలను జరిపించారు.

## జన్మస్థలం

అన్నమయ్య వేమన లిరువురూ రాయలసీమ అభిజనంగా ఆంధ్రావనిలో జన్మించినవారే.

అన్నమాచార్యుల జన్మస్థలం నేటి కడపజిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్లపాకగ్రామం. ఆనాళ్లలో ఈప్రాంతం 'హొత్తపి నాడ'ని పిలువబడేది. అన్నమయ్య జన్మించిన గ్రామము ఇదే అని ఆయన మనుమడు చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రమే ఆధారము. ఈ విషయంలో ఎవరికిని ఎట్టి సందేహమూ లేదు.

ఇక వేమన్న జన్మస్థలం గురించి విమర్శకుల్లో భేదాభిప్రాయాలున్నాయి. కడపజిల్లా చిట్వేల్ అనీ, కదిరితాలూకా కటారు అనీ, కర్నూలుజిల్లా క్రిష్టిపాడు అని పలువురి పరిశోధకుల అభిప్రాయం. మరి

కొందరు పండితులు వేమన్న చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూక మూగ చింతపల్లెలో జన్మించాడనీ, పై వాళ్లు చెప్పినట్లుగా వేమన్న కటారు, చిట్వేల్ మున్నగు ప్రాంతాల్లోను, రాయలసీమ అంతటా సంచరించి నాడని నిర్ధయించినారు.

ఏదిఏమైనా, ఎవరి అభిప్రాయం సమంజసమైనా కాకపోయినా, వేమన రాయలసీమ వాడని అందరూ ఘంటాపథంగా నిర్ధయించిన మాట.

# జీవితాలు

## అన్నమాచార్యుల జీవితం

క్రీస్తుశకం 1408లో వైశాఖ మాసం పున్నమి నాడు తిరుమలప్పని ఖడ్గమైన నందకాంశంతో జన్మించిన కారణజన్ముడు తాళ్లపాక అన్నమాచార్యులు. నారాయణసూరి లక్కమాంబలు అన్నమయ్య తల్లిదండ్రులు. తిరుమలేశుని వరప్రసాదియైన అన్నమయ్యకు చిరుత ప్రాయంలోనే గోవిందునిపై భక్తి అంకురించింది. ఆనందంతో చిందులేస్తూ ఎప్పుడూ వేంకటేశ్వరునిపై ఏవేవో పాటలు పాడేవాడు.

అన్నమయ్య ఎనిమిదేళ్ల వాడయ్యాడు. ఒకానొక రోజు. అన్నమయ్యకు స్వప్నంలో 'ఎల్లలోకములకు అప్పడగు' శ్రీవేంకటనాథుని దర్శనమయింది. ఆ స్వామి తనను దర్శించుకొన రమ్మని పిలిచినట్లయింది. అన్నమయ్య మేల్కొంచినాడు. మేల్కొన్న అన్నమయ్య "ఇప్పుడిటు కలగంటి" అని ఆనందంతో అత్యంత భక్తితో పాడుతూ, ఆడుతూ తిరుగుతూ ఉండినాడు. ఇది సహించని ఇంటిల్లిపాదీ అన్నమయ్య సోమరిగా తిరుగుతున్నాడని తలంచారు. అన్నలు విసుక్కున్నారు. వదినలు కోప్పడ్డారు. అందులో ఒక గడుసువదిన "పనీ లేదూ పాటా లేదు. పైగా ఇదొకటి! పొట్టపగల తినడం, కూనిరాగాలు తీస్తూ పాతగుళ్ల చుట్టూతిరగడం" అని దెప్పిపొడుస్తూ "పశువులకు పొద్దుట్నుంచి గడ్డే లేదు పొలానికెళ్లి

తీసుకురా !'' అని హుకుం జారీ చేస్తూ కొడవలి చేతి కిచ్చింది. విధిలేక అన్నమయ్య కొడవలితో పొలం వైపు అడుగు వేశాడు.

పొలంలో గడ్డికోస్తూ పరధ్యానంలో వున్న అన్నమయ్య కొడవలితో తన వేలిని కోసుకున్నాడు. కారుతున్న రక్తం కళ్ల బడింది. బాధగా మూలిగాడు అన్నమయ్య. కొడవలి ఎప్పుడు జారిపోయిందో తెలియదు.

"తగబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
వగల బెట్టుచుఁ తిరుగువారే కాక
అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతు వాసికి పెనఁగువారే కాక"

అని ఉద్రేకంగా ఊగిపోయింది మనసు. అంతలో అటుగా వెళ్తున్న యాత్రిక బృందంతో తిరుపతికి బయలుదేరాడు అన్నమయ్య.

తిరుపతి కొండఎక్కుతూ, మోకాళ్ల పర్వతం వద్ద అన్నమయ్య మూర్ఛపోవడం, అలమేలుమంగ అన్నమయ్యను సేదదీర్చి, ప్రసాదాలు తినిపించి, కాళ్లజోళ్లు లేకుండా కొండకు వెళ్లమని చెప్పి దర్శన మిస్తుంది. అప్పుడే అన్నమయ్య, అలమేలుమంగ మీద శతకం ఆశువుగా చెప్తాడు. తదుపరి కొండకు చేరుకున్న అన్నమయ్య శ్రీవారిని దర్శిస్తాడు. తిరుమల మీద "విష్ణువ"ను యతిచే వైష్ణవ స్వీకారం చేసి, ఆనాటి నుంచి అన్నమయ్య అన్నమాచార్యులైనాడు.

తరువాత అన్నమాచార్యులు తాళ్లపాకను చేరి తిరుమలమ్మ, అక్కలమ్మలను వివాహ మాడిన తరువాత తిరుమల చేరతాడు. స్వామిపై కీర్తనలు పాడుతూ, ఊరూరా, వాడ వాడలా శ్రీవేంకటేశ్వర భక్తి ప్రచారం చేస్తుంటాడు. అలాంటి ప్రచార సమయంలో తన మీద పాట పాడుటకు తిరస్కరించిన అన్నమయ్యకు బంగారు సంకెల వేస్తాడు సాళువ నరసింహరాయలు. అన్నమయ్య తనమహిమతో సంకెలనూడదీసి

కొని, తిరుమల చేరి, తన జీవితాంతం శ్రీవేంకటేశ్వర సంకీర్తన యజ్ఞంతో తరించాడు. క్రీస్తు శకం 1503 లో "హరియవతార మీత" డైన అన్నమయ్య తిరుమల శ్రీహరిలో లీనమైనాడు. ఆ తరువాత ఆయన చేసి చూపిన సంకీర్తన యజ్ఞాన్ని అన్నమయ్య పుత్రులు, పౌత్రులు యథా శక్తిగ నిర్వర్తించినారు.

## వేమన్న జీవితం

తల్లీ దండ్రీ లేని బిడ్డగా, అన్నావదినల గారాబుగా పెరిగాడు వేమన్న. వదిన నరసాంబ తల్లిలేనిలోటు తీర్చి వేమన్నను పెంచి పెద్ద చేసింది. వదినగారు చూపిన ప్రేమవల్ల, స్వేచ్ఛాలోలు డయ్యాడు. సావాస దోషంవల్ల శృంగార పురుషునిగా, విలాస వంతునిగా మారి, వేశ్యాలోలు డయ్యాడు వేమన్న.

వేమన్న నడతను చూచి వదిన మనసు కుంగింది. అయ్యో! వేమన్న చెడిపోతున్నాడేనని ఆమె మనసు ఆక్రోసించింది. సక్రమ మార్గంలో పెట్టాలని నిశ్చయించుకొంది. అదనుకోసం ఎదురు చూస్తూ వుండింది.

ఒకనాడు వేశ్యకోరికపై వేమన తన వదిన వద్దకు వచ్చాడు. ఆమె నగలన్నీ ఇమ్మని అడిగాడు. ఆమె కాదనలేక తన నగలన్నీ ఒలిచి ఇచ్చింది. ఒక్క ముక్కుపుటక తప్ప. మళ్లీ తిరిగి వచ్చాడు వేమన్న ముక్కెర కోసం. ఒక్క షరతు పెట్టింది వదిన. "ముక్కెర ఇస్తాను. కాని వేశ్యను వివస్త్రగా చూడాలని". ఓస్ అంతేకదా సరే నన్నాడు వేమన్న. ముక్కెర తీసుకొని వేశ్య కిచ్చాడు. వదిన గారి ఆన ప్రకారం వేశ్యను దిగంబరిగా చూశాడు. అంతే వేమన మనస్సు వికలమయ్యింది. రక్తుడు విరక్తు డయ్యాడు. రాగి విరాగిగా మారాడు. అజ్ఞానంలో మునిగి వున్న వేమన్న విజ్ఞానిగా మారి యోగిగా మారాడు. పరమయోగమార్గం అనుసరించాడు. లోకకల్యాణం కోసం కంకణం కట్టుకున్నాడు. ఇంతలో కంసాలి

అభిరామయ్య పొందజూచిన గురూపదేశం తంత్రంతో పొందాడు. ఆ ఉపదేశంతో అబ్బిన అశుకవిత్వం ద్వారా ఊరూరా, వాడ వాడలా తిరుగుతూ జ్ఞానబోధ చేశాడు. కంటబడిన చెడును నిశితంగా ఖండిస్తూ ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడ్డాడు వేమనయోగి.

## ప్రధానమైన మలుపులు!

వీరిద్దరి జీవితాల్లో ప్రధానమైన మలుపులు వారి వారి వదినగారల వల్ల జరిగాయి.

ఆనందంతో ఆడుతూ, భక్తితో పాడుతూ, తిరుగుతున్న అన్నమయ్యను చూచి సోమరిగా తిరుగుతున్నాడని తలచి గడ్డి తెమ్మని కొడవలి చేతి కిచ్చింది అన్నమయ్యవదిన. అంతే. ఆ సంఘటన అన్నమయ్య జీవితంలో పెద్దమలుపు తీసుకొని వచ్చింది. గడ్డికోస్తూ వేలుకోసుకున్న అన్నమయ్య వేంకటాచలం వైపు మొదటి అడుగు వేయడానికి కారణం అయ్యింది. లౌకిక ప్రపంచానికి మళ్లించాలని అభిప్రాయ పడిన వదినగారి ప్రయత్నం విఫలమై, అన్నమయ్యను ఆధ్యాత్మిక రంగానికి దగ్గర చేసి తద్వారా అన్నమయ్య శ్రీవేంకటేశ్వర భక్తి మార్గోపదేశకుడిగా ప్రకాశించాడు.

అలాగే భోగ లాలసుడుగా, వేశ్యా లోలుడుగా వున్న వేమన్నను మంచిదారికి మళ్లించాలని అతని వదిన తపన పడింది. అదనుకోసం కాచుకొనివున్న వేమన్నవదిన వేశ్యను దిగంబరిగా చూడమని వేమన్నకు ఆనతిచ్చింది. వేమన్న సరే నన్నాడు. అంతే ఆమె కోరిక ఫలించింది. వేమన్న సన్మార్గగామియై వరలినాడు. ఇక్కడ వేమన్నను మంచి మార్గానికి మార్చాలను వదినగారి ప్రయత్నం ఫలించింది. వేమన్న తాను బాగుపడడమే గాక సన్మార్గోపదేశకుడుగా కూడా వెలుగొందాడు.

అన్నమయ్య, వేమన లిరువురి భాషలో, భావాల్లో పదాల్లో, స్పష్టంగా గోచరించే సామ్యాలు ఎన్నో ఉన్నాయి. అన్నమయ్య వేమన్న లిరువురూ తెలుగు నాట, తెలుగు నోట ముఖ్యంగా రాయలసీమ ప్రజల్లో నానుతున్న నుడులను, నానుళ్లనూ, జాతీయాలనూ, పలుకు బళ్లనూ, భావాలను తమరచనల్లో ప్రయోగించిన శిష్ట వ్యావహారిక భాషా వేత్తలు.

అన్నమయ్య వేమన లిరువురి భావ సామ్యాలను, భాషా సాదృశ్యాలను కొన్ని ఉపశీర్షికల క్రింద విభజించి పరిశీలించడం జరిగింది.

## ప్రభాకరుల కరస్పర్శ!

అసూర్యం పశ్యలా వున్న అన్నమయ్య రాగిరేకుల సాహిత్యం పండిత ప్రభాకరులు వేటూరి వారి కరస్పర్శ వల్ల వెలుగులోనికి వచ్చింది. అలాగే చీకటి గదుల్లో తాళపత్రాల్లో దాగివున్న వేమన్న సాహిత్యం పాశ్చాత్య పండిత ప్రభాకరులైన C.P. బ్రౌన్ దొరగారి కరస్పర్శ వల్ల వెలుగు చూచింది.

## మధుర కవిత

అన్నమాచార్యులు, వేమన లిరువురూ పుట్టుకతోనే భోగులు. అంటే సంపన్నమైన కుటుంబంలో జన్మించిన వారన్నమాట. ఇద్దరూకూడ వేదాంతులే. ఈ మహాకవు లిద్దరికీ సహజంగా జన్మముతోనే మధురకవిత్వమూ, సహజ పాండిత్యమూ అబ్బినాయి. వీరిద్దరూ దేశీ ఛందోగీతిక లాలాపించిన వారే.

అన్నమాచార్యులు మంజులమైన, మధురమైన మనోహరమైన తేట తెలుగు పదకవితలనూ; వేమన సుందరమైన, సున్నితమైన,

సునిశితమైన తేటతెలుగు ఆటవెలది పద్యాలనూ ఆయుధాలుగా స్వీకరించారు. తమ ఆయుధాలతో లోక కల్యాణమే లక్ష్యంగా భావించి కృషి సల్పారు. తమ లక్ష్యసాధనలో చెడును తెంచుకుంటూ మంచిని పెంచుకుంటూ ముందుకు సాగిన గొప్ప ఆధ్యాత్మిక ప్రభోధకులు వీరు.

# గురు భక్తి - గురు మహిమ

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః
గురు ర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షా త్పరంబ్రహ్మ
తస్మై శ్రీగురవే నమః"

అని హిందూ ధర్మంలో సర్వమతాల వారూ గురువును సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా భావించి పూజిస్తారు.

**గురుచరణాంబుజ నిర్భర భక్తః
సంసారాదచి రాద్భవముక్తః
సేంద్రియ మానస నియమాత్ ఏవమ్
ద్రక్ష్యసి నిజహృదయ స్థదేవమ్॥**

అని శ్రీ శంకర భగవత్పాదులవారు కూడ గురుభక్తి ద్వారానే సంసారాన్ని తరించి దైవాన్ని దర్శించమని ప్రబోధించారు.

అలాగే మహాకవులైన తాళ్లపాక అన్నమాచార్యులు, వేమన కూడా తమ తమ గురువుల యొక్క మహిమలను పెద్దగా కొనియాడారు. అసలు తామింత వాళ్లు అగుటకు తమ గురుభక్తి, గురువు అనుగ్రహమే కారణమని కీర్తించారు.

నా ఆత్మలోని అజ్ఞానాన్ని మా ఆచార్యుడే పోగొట్టాడు. ఇక నాకు జన్మ పరంపర లేదు. గురువు అనుగ్రహం వల్లనే హరిదాస్యం కలిగింది. నేను ఈ జన్మములోనే జీవన్ముక్తుడ నైతినని అన్నమాచార్యులు

ఆతుమలో సజ్ఞాన మాచార్యుఁడే పాపె
ఆతల జన్మాల వాకి లటు ముయ్యరో
చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడ నైతి
జాతి యధర్మములాల సంబంధము విడరో

అని కీర్తించాడు. గురుసేవ చేసినవారికి "కలగన్న వాడు మేల్కొన్నట్లు" గా ఆత్మజ్ఞానము కలుగుతుందని అన్నమయ్య

"పలుమారు గురుసేవ ఁ బరగఁగా ఁ బరగఁగా
చలివాసి యాత్మజ్ఞానము పొడచూపు"

అని వక్కాణించాడు. ఇంకోచోట

హరి! నీరూపము నాకు నాచార్యుఁడు మున్నె
కెరలి నాపాల నప్పగించినాఁడు

అని అన్నమయ్య నిరంతర హరిధ్యానము గురూపదేశం వల్లనే తనకు సిద్ధించినదని చెప్పుకున్నాడు. ఆ గురువు అనుగ్రహము వలన ఏలాంటి కొరత వుండదు

"గురువు గల వానికి కొఱఁత యేమియు లేదు"

అని కీర్తించినాడు. అంతేకాదు వైష్ణవమత ప్రవక్తలైన భగవద్రామానుజులను గురువుగా భావించి స్తుతించిన తీరు పరిశీలించ తగినది.

## దేసాళం

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘన గురుదైవము ॥ పల్లవి ॥

యీతని కరుణనే కా యిలవైష్ణవుల మైతి
మీతని వల్లనే కంటి మీ తిరుమణి

యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర
మీతఁడే రామానుజులు యిహపర దైవము ॥ గతు ॥

వెలయించె నీతఁడే కా వేదపు రహస్యము
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడే కా నిజముద్రా ధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥ గతు ॥

నియమము లీతఁడే కా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశు నగ మెక్కెవాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టే తల్లిదండ్రి దైవము ॥ గతు ॥

ఇక వేమన్నకూడా అన్నమాచార్యుల మాదిరే గురువును కొనియాడుతూ తాను ఇంతవాడగుటకు గురుమహిమే కారణమని వివరించినాడు.

గురువు లేని విద్య విద్యే కాదు. గురుముఖతః విద్యను సంపాదించాలి. అప్పుడే ఆ విద్య సంపూర్తిగా సిద్ధిస్తుంది. అన్న అభిప్రాయాన్ని వేమన

గురువు లేక విద్య గురుతుగా దొరకదు
నృపతిలేక భూమి తృప్తిగాదు
గురువు, విద్య లేక గురుతర ద్విజుడౌనె?
విశ్వదాభి రామ వినుర వేమ!

అని ఇలాగ వివరించాడు. మరి ఆ గురువు ఎలాగుండాలి? అన్నప్రశ్నకు సమాధానంగా వేమన

కస్తురి యిటు చూడ కాంతి నల్లగ నుండు
పరిమళించు దాని పరిమళంబు
గురువులైన వారి గుణము లీలాగురా
విశ్వదాభి రామ వినుర వేమ!

అని సద్గురువు లక్షణాలను వివరించినాడు. అలాంటి సద్గురువు సాక్షాత్తు పరమాత్ముడని

గురు డనగా పరమాత్ముడు
పరగంగా శిష్యుడనగ పటు జీవుడగున్
గురు శిష్య జీవ సంపద
గురుతరముగ గూర్చు నతడు గురువగు వేమా!

అని వ్యాఖ్యానించినాడు. కనుక లోకులారా జాగరూకులై అన్వేషించి సద్గురువును తెలిసికొని, ఆశ్రయించి శాశ్వతమైన మోక్షాన్ని పొందండి. అలాంటి మోక్షానికి మార్గం ఒక్క గురువు మాత్రమే చూపగలడు. గురువును కనని వాడు నరకకూపంలో చిక్కుకుంటాడు.

లోకములకు గురువు లోకులకును గురు
వది దెలిసి మోక్ష మంద రోరి
గురుని కనక నరక కూపము బొందిరి
విశ్వదాభి రామ వినుర వేమ!

అని వేమన్న ప్రబోధించినాడు. అంతేకాదు. లోకంలో ఏమతం వారికైనా సద్గురువు అనుగ్రహము అత్యవసరము. కనుక గురువు నెరుగని వాడెవడైనా సరే. వాడు గుణహీనుడు. అలాంటివాడు ఏమియు తెలియని అజ్ఞాని.

"శివ మతమునకైన వివరింపగా గుర్వు
హరిమతమునకైన నరయ గుర్వు
గురువు నెరుగ లేని గుణహీనుఁ డేమెర్గు
విశ్వదాభి రామ వినుర వేమ"

అని వ్యాఖ్యానిస్తూ చివరగా సద్గురువు మహిమను ఇలా చాటినాడు

సద్గురు కృప జ్ఞానంబున
సద్గతి దీపింపుచున్న చాల చదువుల్
సద్గతి గలుగఁగఁ జేయును
సద్గురువే దైవ మనుచు జాటర వేమా!

# మూర్ఖ భక్తుడు

ఒక పామరడు తనమెడలో తానే కట్టుకొన్న శివలింగము మీద నమ్మకంలేక అంటే పరిపూర్ణ విశ్వాసం లేక పర్వతాని కేగు తున్నాడట! అదే విధంగా తానే భగవత్స్వరూపుడై వుండగా ఎక్కడో దేవుణ్ని వెదకు తున్న అజ్ఞానినిగూర్చి తాళ్లపాక అన్నమాచార్యులు ఇలా వివరిస్తున్నాడు.

"అరుత లింగము గట్టి యది నమ్మజాలక
పరువత మేగిన బత్తుఁడ నైతి
సరుస మేకపిల్ల చంక బెట్టుక నూఁత
నరయు గొల్లని రీతి అజ్ఞాని నైతి"

ఒక వెఱ్ఱి గొల్లవాడు మేకపిల్లను తనచంకలోనే పెట్టుకొని దానికొరకై ఊరంతా వెదకినాడట! పై చరణంలో అన్నమయ్య వక్కాణించిన అదే భావాన్ని అదే వదజాలంతో వేమన్న ఇలాగ రెండు ఆటవెలది పద్యాల్లో ఎలా వివరించాడో చిత్తగించండి.

అరుత లింగముంచి, అదియును చాలక
పర్వతమున కేగు పామరుండు
ముక్తిగాననగునె మూఢాత్ముడగుగాక
విశ్వదాభిరామ వినుర వేమ.

మనసులోని ముక్తి మరియొక్క చోటను
వెదకబోవు వాఁడు వెఱ్ఱివాడు
గొఱ్ఱె చంక బెట్టి గొల్ల వెదకురీతి
విశ్వదాభిరామ వినుర వేమ.

## భగవంతుడు సర్వవ్యాపి

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మున్నగునవి సామాన్య మానవుడికి సులభంగా అర్థంకానట్టి అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాయి. ఆ సిద్ధాంతాన్నే మన అన్నమయ్య వేమన్నలు తెలుగుజాతి కంతటికి సులువుగా అర్థం అయేటట్లు అలతి అలతి తేటతెలుగు పలుకుల్లో ఎలా సంతరించారో గమనించండి.

"బయలు దునిసి బహుభానులై తోఁచీని
బయలొక్కట అఖండ పరిపూర్ణము"

సూర్యుడొక్కడే. కాని జీవులు అనేకులు. ఆ ఒక్కసూర్యుడే అనేకజీవులకు అనేక సూర్యులుగా కనపడినట్లు గానే, అఖండ పరిపూర్ణమైన పరబ్రహ్మ ఒక్కటే. సర్వాంతర్యామి కూడా. బయలంతా ఆయన స్వరూపమే. ఇదే భావం సహజ పండితుడైన మహాకవి పోతనలో కూడ కన్పడుతున్నది చూడండి.

ఒక సూర్యుండు సమస్త జీవులకుందా
నొక్కొక్కండై తోంచు పో
లిక నే దేవుండు సర్వకాలము మహా
లీలన్ నిజోత్పన్న జ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్
నానా విధానూన రూ
పకుండై యొప్పుచు నుండు నట్టి హరి నే
బ్రార్థింతు శుద్ధుండనై

పైన అన్నమాచార్యులు పేర్కొనిన భావమును, వేమనయోగి

బయలున సర్వము పుట్టును
బయ లందే లీనమగును, బ్రహ్మం బనగా
బయలని మదిలో తెలిసిన
బయులందే ముక్తి బట్టబయలగు వేమా!

అని నిర్వచించినాడు.

ఇంకోచోట అన్నమాచార్యులు 'భగవంతుడు సర్వసాక్షి' అనే అభిప్రాయాన్ని ఇలాగ

"సర్వసాక్షివి నీవు సర్వాంత రంగుడవు!
సర్వ సర్వం సహాచక్రవర్తివి
నిర్వాణమూర్తీ! నిగమాంత కీర్తీ!!

అని సకల చరాచర జగత్తులో వ్యాపించి, సర్వసాక్షిగా ఉన్న సర్వేశ్వరుని మూలతత్త్వాన్ని వివరించాడు. మహాకవి వేమన కూడ తాళ్లపాక అన్నమయ్య వలెనే

సకలాకారు (డనంతు(డు
సకలాత్మలయందు సర్వసాక్షియు తానై

సకలమున నిర్వికారుం
డకలంక స్థితిని బ్రహ్మమని బడు వేమా!

అని తెల్పుతూ 'సర్వం విష్ణుమయం జగత్' అను ఉపనిషత్ సిద్ధాంతాన్ని తేట తెల్ల పరచినాడు.

# జీవితం ఒక నాటకం

మానవ జీవితము అశాశ్వతము. అది ఒక నాటకము వంటిది మాత్రమే. ప్రతినాటకానికి ప్రారంభము ముగింపు వున్నట్లే ఈ బ్రదుకు మూడునాళ్ల ముచ్చట. ఈ జీవిత నాటకంలో నట్టనడిమి పనికూడా తాత్కాలికమే. ఇలాంటి బ్రదుకునకు మంచి ఆహారం పెట్టినా, ఆడంబరమైన వస్త్రాలంకరణ చేసినా, అది కొద్ది కాలం మాత్రమే. కనుక సత్యమైన శాశ్వతమైన పరబ్రహ్మను కొలిచి తరించవలసినది అను ఉపదేశాన్ని ఇలాగ వ్యక్తీకరించాడు అన్నమాచార్యులు.

నానాఁటి బదుకు నాటకము
కానక కన్నది కైవల్యము

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము
యెట్టనెదుట గల దీప్రపంచమును
కట్టఁగడపటిది కైవల్యము.

కుడిచే దన్నము కోకచుట్టెడిది
నడుమంత్రపు పని నాఁటకము
వొడి గట్టు కొనిన వుభయ కర్మములు
గడి దాటి నపుడె కైవల్యము.

తెగదు పాపమును తీరదు పుణ్యము
నగి నగి కాలము నాఁటకము
యెగువనె శ్రీవెంకటేశ్వరుఁ డేలిక
గగనము మీఁదిది కైవల్యము ॥నానా॥

పైన తాళ్ల పాక అన్నమాచార్యులు వెలువరించిన భావాన్ని ఇంచుమించు అదే మాదిరిగా వేమన ఇలాగ వివరిస్తున్నాడు.

తల్లిగర్భమందు తా బుట్టి నపుడు
మొదలు బట్ట లేదు తుదను లేదు
నడుమ బట్ట గట్ట నగుబాటు గాదొకో
విశ్వదాభిరామ వినురవేమ !

ఈ జీవిత నాటకంలో ప్రవేశించినపుడు, బట్ట లేదు. పోనీ! చివరన చూద్దామా! అంటే అప్పుడూ బట్ట వుండదు. మరి ఈ నట్ట నడిమి జీవితంలో ఆడంబరమైన వస్త్రాలంకరణతో, అశాశ్వతమైన భోగాలతో కాలాన్ని వెళ్ల బుచ్చడం నగుబాటే కదా! కనుక నిత్యమైన సత్యమైన పంథాను అనుసరించి శాశ్వత సుఖాన్ని పొందవలసినది- అని వేమన్న స్పష్టం చేస్తున్నాడు.

## కామినీ సుఖం

'స్త్రీల అధరము తేనెకంటే మహా రుచి. కాని అది మానవుణ్ని తక్షక కర్కోటకాది మహాసర్పాల విషంవలె నాశనం జేస్తుంది. జాగ్రత్త! ఆ విషాన్ని పోగొట్టే విరుగుడుమందు లేనే లేదు' అని పదకవితా పితామహుడు ఇలా ప్రజలను హెచ్చరిస్తున్నాడు.

అతివలనెడి సర్పా లధరాలు గఱచ
తతి మదన విషాలు తల కెక్కను

మితినేని రతుల దిమ్మరివట్టె దేహము
మతిమఱచె నిందుకు మందేదాకో

పొలంతులనెడి మహాభూతాలు సోకిన
తలమొలలు విడి బిత్తలై యున్నారు
అలరు చెనకులచే సంగములు జీరలాయ
మలసి యిందుకు నికమంత్ర మేదాకో

తరుణుల కౌగిలనే తాపజ్వరాలు వట్టి
కరంగి మేనెల్ల దిగంగార జొచ్చెను
నిరతి శ్రీవేంకటేశ నీవే లోకులకు దిక్కు
అరుదు సుఖాననుండే యంత్ర మేదాకో

అని అంటూ, మరొకచోట అన్నమాచార్యులు జ్ఞానులు, యోగులు, విరక్తులైన మానవులు ఇవి నిజమే అని నమ్మక జాగ్రత్తగా మసలు కోండి అని ఇలా గానం చేస్తున్నాడు.

జ్ఞానులాల యోగులాల సకల విరక్తులాల
నానా విధాల నివి నమ్మేరు సుండీ ॥ పల్లవి ॥

అలరి యింతుల యధరామృతము వివియెల్ల
కాలకూట విషముల కరణి సుండీ
శీలముతో వీరల చెట్టలు వట్టుట లెల్లా
బాలనాగాలం దొడికి పట్టుట సుండీ ॥ జ్ఞాను ॥

కాంతలు నవ్వుచునైనాం గన్నులం జూచిన చూపు
వంతమున నలుగుల పొంతర సుండీ
బంతుల నెదుటనున్న పడంతుల చన్నులివి
కంతల నొద్దిన బడిగండ్లు సుండీ ॥ జ్ఞాను ॥

జవ్వనపుం గామినుల సరసపు మాటలెల్లా
మవ్వమైన యట్టి చొక్కుమంత్రాలు సుండీ

యివ్వలను శ్రీవేంకటేశ్వరు దాసుల కివి
చివ్వనఁ జెప్పినట్టు చేసేవి సుండి ॥ జ్ఞాను ॥

అన్నమయ్య స్త్రీల యధరామృతాలు కాలకూట విషాలనీ, వారలను చేపట్టుట నాగుపాము పిల్లలతో ఆడుట వంటిదనీ, చెప్పుతూ ఆయువతుల, చూపులకు, నవ్వులకు, సరసపు మాటలకు, లోనైన వానిగతి అధోగతియని పై పాటలో ప్రబోధించాడు. ఇంకోచోట తాళ్లపాక అన్నమాచార్యులు స్త్రీ సుఖాన్ని గూర్చి ఇలాగ వాపోతున్నాడు.

## వరాళి

ఎచ్చోటి కేఁగిన యెవ్వడూఁ దమలోని
మచ్చిక పెనుఁదెవులు మానకపోయె ॥ పల్లవి ॥

పాయపు సతుల గుబ్బల పెదపొట్లాల
కాయము వడి నొత్తి కాఁచఁగను
రాయిడిచే ఘనమాయఁ గాని లోని
మాయపు పెనుఁదెవులు మానక పోయె ॥ ఎచ్చో ॥

అతివల మోహపు టధరామృతములు
యితవుగ నోరి కందియ్యఁగను
అతిమోహమే ఘనమాయఁ గాని లోని
మతకరి పెనుఁదెవులు మానకపోయె ॥ ఎచ్చో ॥

తరుణుల మేని మెత్తని పరపుల మీఁద
నిరవుగ నిటు సుఖియించఁగను
తిరువేంకటాచలాధీశు కృపచేఁగాని
మరుచేతి పెనుఁదెవులు మానకపోయె ॥ ఎచ్చో ॥

జగద్గురువు శ్రీ ఆదిశంకరులు తన 'భజగోవింద' స్తోత్రంలో స్త్రీ సౌందర్యాన్ని చూచి మోహం పొందవద్దని ఇలా ప్రబోధిస్తున్నారు చూడండి.

నారీస్తన భర నాభీదేశం
దృష్ట్వామాగా మోహావేశమ్ ।
ఏతన్మాంస వసాది వికారం
మనసి విచిన్తయ వారం వారమ్ ॥

సుఖతః క్రియతే రామా భోగః పశ్చాద్దన్త శరీరే రోగః
యద్యపి లోకే మరణం శరణమ్॥
తదపి నముంచతి పాపాచరణమ్ ॥

అలాగే వేమనయోగి కూడ స్త్రీని, స్త్రీ లోలత్వాన్ని తీవ్రంగా నిరసిస్తాడు.

మంత్రమెల్ల మరచి మధురాధరము దల్చి
నేవిధమున భక్తుడెరుగు నిన్ను
యోనిజూచి పరమయోగంబు మరతురా
విశ్వదాభిరామ వినుర వేమ.

మరోచోట వేమన

ఇంతి కనులు చనులు యెంత లెస్సని చూచి
మోహపడును బుద్ధి మోసపోయి
గరిసెలోని వాని కానలేడాయరా
విశ్వదాభిరామ వినుర వేమ.

కాంతమేను జూచి కళవళ పడుదురు
కడుపులోని రోత గానలేరు
యింత రోతబ్రతుకు యీ దేహ మేలరా?
విశ్వదాభిరామ వినుర వేమ

# దేవుడొక్కడే

సర్వాంతర్యామియైన భగవంతుడు ఒక్కడే. ఆ దేవుడు, ఎన్ని రూపాల్లో కొలువబడినా ఎన్ని పేర్లతో పిలువబడినా ఒక్కడే. ఈ భావాన్ని అన్నమాచార్యులు ఎలా విమర్శించుతున్నాడో గమనించండి.

కలవు మతములు పెక్కు కర్మ భేదము లగుచు
కలవెల్ల నీయందె కల్పితములె
కలరు దేవతలు బహుగతుల మహిమల
అలరి వారెల్ల నీయంగ భేదములే

ఘనమంత్రములు పెక్కుగలవు పరముల నొసగు
ననిచి యవి యెల్ల నీ నామంబులే
పెనుగొన్న జంతువులు పెక్కులెన్నే గలవు.
పనిగొన్న నీదాస పరికరములే

యెందును దగులుఁవడ కేకరూపని నిన్ను
కందువఁ గొలుచువాఁడె ఘనపుణ్యుడు
అందపు శ్రీవేంకటాద్రీశ అన్నిటా
నందిన పొందిన వెల్లా హరి నీయనుమతే

ఇదే భావాన్నే వేమన్న వేరే ఉపమానాలతో ఇలాగ వివరించాడు.

పసుల వన్నె వేరు పా లేకవర్ణమౌ
పుష్ప జాతి వేరు పూజ యొకటి
దర్శనంబు లారు దైవంబు ఒకటి
విశ్వదాభి రామ వినుర వేమ

అయితే, అన్నమాచార్యులు శ్రీవైష్ణవుడు కనుకనూ అందులోను శ్రీవేంకటేశ్వరుని పరమభక్తుడు కనుకనూ, ఎవరు ఎన్ని మార్గాల్లో ఉపాసించినా, ఆ పరతత్త్వం ఒక్కటే అని ఇలాగ శ్రీవేంకటేశ్వరుని పరంగా వివరిస్తున్నాడు.

శ్రీవేంకటేశర్వుడే పరబ్రహ్మ స్వరూపం. ఆయనొక్కడే దేవుడు. 'సర్వంవిష్ణు మయం జగత్' అని 'వినా వేంకటేశం ననాధో ననాథః' అన్నమయ్య దృఢ సంకల్పం.

అయితే, ఆ బ్రహ్మాండ నాయకుడు అనేక పేర్లతో పిలువబడుతున్నాడనీ, అలా పిలువ బడుతున్నప్పటికీ ఆపేర్లన్నీ ఆయనకే చెందుతున్నాయనీ, ఈ క్రింది పాటలో అన్నమయ్య అనంత భిన్నత్వంలో ఏకత్వాన్ని స్పష్టం చేశాడు.

## బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥ పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
వలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుఁచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుడనుచు ॥ ఎంత ॥

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచిన వారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘన బుద్ధులకు ఘనుఁడవు ॥ ఎంత ॥

నీ వలన ఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథి దరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీ వేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని
యీవల నేనీశరణనియెదను యిదియే వరతత్వము నాకు ॥ ఎంత ॥

తిరుమలపై నెలకొన్న శ్రీనివాసుణ్ని వైష్ణవులు విష్ణువుగా కొలుస్తున్నారనీ, వేదాంతులు పరబ్రహ్మమనీ, శైవులు ఆయన్నే శివునిగా తలచి పూజిస్తారని, కాపాలికులు ఆదిభైరవునిగా కీర్తిస్తారని పేర్కొన్నాడు అన్నమయ్య.

అట్లే శాక్తేయులు ఆ తిరుమలేశ్వరునే శక్తి దేవతగా పూజిస్తారని, ఇలాగ అనేకులు అనేక విధాలుగా తలచి ఉపాసిస్తారనీ, అయినా వారందరూ ఎలాగ తలచినప్పటికీ అలాగే కన్పడతాడట ఆస్వామి. గంగా నదీ తీరంలోని బావుల్లో గంగానది జలమే ఊరినట్లు ఏపేరుతో పిలిచినా ఆ వేంకటేశ్వర స్వామి మనలనందరినీ చేకొని రక్షించేటి దైవమని తాళ్లపాక అన్నమయ్య పైపాటలో వివరించాడు.

అలాగే ఆధ్యాత్మిక కవియోగి అయిన వేమన కూడా పైన అన్నమయ్య వివరించినట్లుగానే ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు చూడండి.

కుండ కుంభ మండ్రుకొండ పర్వత మండ్రు
యుప్పు లవణ మండ్రు యొకటిగాదె
భాషలింతె వేరు పరతత్వ మొక్కటి
విశ్వదాభి రామ వినుర వేమ.

ఏ పేరుతో పిలిచినా, ఏ భాషలో పిలిచినా ఆ పరతత్త్వము ఒక్కటేనని వేమన్న వాఖ్యానించాడు.

## అహం బ్రహ్మాస్మి

"అహం బ్రహ్మాస్మి" అనే ఉపనిషత్ తత్త్వాన్ని తాళ్లపాక అన్నమాచార్యులు లౌకిక దృష్టాంత పూర్వకంగా వివరించిన తీరు గమనింప దగినది.

వెన్నచేత బట్టి నేయి వెదకఁగ నిఁక నేల
నిన్నులోన నించుకొని నిజమేదో యననేల

అదే అద్వైత సిద్ధాంతాన్ని, అదేపలుకు బడితో, అదే ఉపమానంతో ప్రజా కవి వేమన ఎలా ప్రబోధిస్తున్నాడో చూడండి.

వెన్నచేతబట్టి వివరంబు తెలియక
ఘృతము కోరునట్టి యతని భంగి

తాను దైవమయ్యు దైవంబు దలంచును
విశ్వదాభి రామ వినుర వేమ.

## చపల బుద్ధి

ఎన్ని ఉపదేశాలు చేసినా, ఎంతవద్దని అడ్డగించినా విననట్టిది మానవుని చంచల మనస్సు. అలాంటి చపల బుద్ధిని గూర్చి మహాకవి అన్నమయ్య ఎత్తిపొడుస్తున్నట్లుగా ఇలా అంటాడు.

పాయదీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి
చాయకెంత కట్టినాను చక్కనుండీనా
కాయపు వికారమది కలకాలము చెప్పినా
పోయిన పోకలే కాక బుద్ధి వినీనా !

కుక్కతోక వంకర. దాని వంకర తీర్చడం శివునితరం కూడా కాదు. అట్లే మనస్సు యొక్క చపలత్వం కూడా. ఈ భావాన్నే వేమన్న కూడా అన్నమయ్య చెప్పిన ఉపమానంతోనే ఇలా వక్కాణిస్తున్నాడు.

కుక్కతోక దెచ్చి గొట్టంబు చేర్చిన
క్రోవి చెంత నుండు కొంతదడవు
ఎంతచెప్ప చెడుగు పంతంబు మానునా
విశ్వదాభి రామ వినుర వేమ.

## దురాశ

దురాశదుఃఖం చేటు. దురాశాపీడితుడైన పామరుడు నశిస్తాడు. ఇది పరమ సత్యం. ఈ సత్యాన్నే నిత్యమూ మనకళ్ల ఎదుట కనపడే ఒకే విషయాన్ని ఉపమానంగా తీసికొని మన మనసులకు హత్తుకొనేటట్లుగా ఈ ఆధ్యాత్మిక కవియోగు లిద్దరూ చిత్రీకరించిన విధాన్ని గమనించండి.

నీటిలో చేపలు గాలాన్నికున్న ఎఱచే ఆకర్షింపబడి ఆశకు లోనై చస్తున్నాయి.

"గాలపు టెబ్బల గంటె, కమ్మనీటిలో మీలు
జాలి నాపసల జిక్కి, చావకుండినా
ఆలరి బంగారుగంటె అందరి మనసులూను
పోలిమి నావస జిక్కి పుంగుడు గాకుండునా"

మరోచోట తాళ్లపాక అన్నమాచార్యులు

నీరులోపలి మీను నిగిడి యామిషముకై
కోరి గాలము మ్రింగి కూలఁబడినట్లు
జారిపోయిననేల సంసార సౌఖ్యవి
కారంపు మోహముల c గట్టువడియెదము

అని వాఖ్యానించగా, వేమనయోగి క్రిందివిధంగా

నీళ్లలోని చేప, నెరిమాంస మాశకు
గాలమందు చిక్కి కూలినట్లు
ఆశఁబుట్టి మనుజుఁడారీతి చెడిపోవు
విశ్వదాభి రామ వినుర వేమ

అని వివరించాడు.

## సంసారం జంజాటం

సంసారాంధకారంలో పడి నా భార్య నా పిల్లలు నా తల్లిదండ్రులు అని అజ్ఞానంతో కొట్టు మిట్టాడుతున్న పామరులైన లోకులను ఉద్దేశించి అనుభవకవియైన అన్నమయ్య ఇలా ప్రబోధిస్తూ వున్నాడు.

"అన్నలంటా తమ్ములంటా, అండ్లంటా బిడ్డలంటా

వన్నెల అప్పు గొన్నవారువో వీరు"

అని అంటూ మరోచోట తాళ్లపాక అన్నమాచార్యులు

చుట్టంబులా తనకు సుతులు కాంతలు చెలులు
వట్టి ఆసల బెట్టువారే కాక
తగబంధులా తనకు తల్లులును తండ్రులును
వగలబెట్టుచు దిరుగువారే కాక

అంతహితులా తనకు అన్నలును తమ్ములును
వంతువాసికి పెనగువారే కాక

అని అంటూ అన్నమయ్య "అయ్యో పోయెనే ప్రాయమూ కాలమూ వీరంతా శాశ్వతను. వాళ్లతోనే నే నుంటాను. నాతోనే వాళ్లుంటారు. అని నమ్ముకొని హరిని ఆత్మలో ఏమాత్రం తలంప లేక పోతినే" అని పరితాపం చెందినాడు. అన్నమాచార్యులు వెలువరించిన అభిప్రాయాన్నే వేమన్న కూడా ఇలా వివరించాడు.

ఎక్కడి సుతు లెక్కడి సతు
లెక్కడి బంధువులు సఖులు నెక్కడి భృత్యుల్
డొక్కబడి పోవు వేళల
చక్కటికిని యెవరు రారు సహజము వేమా

ఆలుబిడ్డలు ధనమరయ తల్లియు దండ్రి
కై మనుజుడు మిగుల కష్టపడును
తనకు నెవరు లేరు తాను బ్రహ్మము గన్న
విశ్వదాభి రామ వినుర వేమ

## దాత - అన్నదానం

దానగుణాన్ని, దాతను గూర్చి ఈ మహాకవు లిరువురూ గొప్పగా వర్ణించారు.

అన్నమాచార్యులు ఒకచోట శ్రీవేంకటేశ్వరుని దాతృత్వాన్ని కొనియాడుతూ "ఉత్తమదాత" లక్షణాలను పేర్కొన్నాడు.

అట్లే వేమన్న కూడా దాతలను కీర్తిస్తూ "దాతలేని యూరు దయ్యాల కొంపరా'' అని చెప్పుతూ మరోచోట ''ఇటుబెట్టిన, ఇట్టుబెట్టిన, ఇటుబెట్టక ముక్తిలేదు. ఇలలో వేమా'' అని నొసటన ఇటు నిలువుబొట్లు ఇటుఅడ్డ బొట్లు పెద్దగా పెట్టుకొన్నప్పటికీ ఇటు చేతితో దానం పెట్టనిచో ముక్తి లేదని చేసైగలతో వేమన్న వ్యాఖ్యానిస్తున్నాడు.

"అన్నం పరబ్రహ్మ స్వరూపమ్"- అని పెద్దలమాట.మరి అలాంటి అన్నాన్ని ఎలాంటి వారకి దానం చెయ్యాలి. ఎలాంటి వారికి అన్నం పెట్టరాదు అని ప్రశ్నించు కుంటే ఈ మహాకవు లిరువురి వాఙ్మయాల్లో మనకు సరియైన సమాధానం వివరంగా దొరుకుతుంది.

''అరయ నా పన్నుని కభయ మీవలెగాక
ఇరవైన సుఖిఁ గావనేలా
వఱతఁ బోయెడివాని వడిఁ దీయవలెఁగాక
దరివానిఁ దివియంగఁ దానే

ఘన కర్మారంభుని కట్లు విడవలెఁ గాక
యెనసి ముక్తునిఁ గావనేలా?
అనయము దుర్బలుని కన్నమిడవలెఁ గాక
తనిసిన వానికిఁ దానేలా

బలహీనునికీ, ఆకలైన వానికీ అన్నంపెట్ట వలెనను సత్యాన్ని ప్రబోధించాడు అన్నమయ్య. ఇక వేమన్న

అన్నమరుగ నతని కన్నంబు బెట్టిన
పారవేసు దాని ఫలితమేమి
ధనికునకు నొసంగు దానము లటువలె
విశ్వదాభి రామ వినుర వేమ

అన్నదానాన్ని గూర్చి వివరించాడు. అందుకే సపాత్ర దానంచేసిన అన్నదాతను గూర్చే "అన్నదాతా సుఖీభవ" అను నానుడి ప్రసిద్ధి

ప్రచారం పొందింది.

## కులమత నిరసన

మానవతా వాదులైన ఈ కవియోగు లిద్దరూ, కులమత భేదాల్లోని సంకుచితత్వాన్ని, అస్పృశ్యతనూ తీవ్రంగా నిరసించినారు. ఒకచోట అన్నమాచార్యులు

విజాతు లన్నియు వృధా వృధా
అజామిళాదుల కది యేజాతి

జాతిభేదములు శరీర గుణములు
జాతి శరీరము సరిఁదోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యాతల హరివిజ్ఞానపు దాస్యంబిది యొక్కటే పో సుజాతి

హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె
ధరణి జాతి భేదము లెంచిన
పరమయోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్వ జ్ఞానము ధర్మమూలమే సుజాతి

లౌకిక వైదిక లంపటులకు నివి
కైకొను నవశ్య కర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి సేసిన సంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి

॥ విజాతి ॥

అని జాతిభేదాలను శరీరగుణాలనీ తీవ్రంగా నిరసిస్తాడు. ఆశరీరగుణాలైన జాతిభేదాలు శరీరంతోడనే చెడిపోతాయనీ, చెడిపోనటు వంటి ఆత్మయే సుజాతి అని వ్యాఖ్యానించాడు అన్నమాచార్యులు. ఇలాగే మరోచోట

ఏ కులజుఁడేమి ఎవ్వఁడైన నేమి
ఆకడ నాతఁడే హరి నెఱిఁగిన వాఁడు

అని హరినెరిగిన వాణ్ణే హెచ్చైన కులజునిగా తీర్మానిస్తాడు. ఇంకోమారు తాళ్లపాక అన్నమాచార్యులు

ఎక్కువ కులజుడైన హీనకులజుఁడైన
నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు

వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి॥
యాదరించని సోమయాజి కంటె
యేదియును లేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుఁడు ॥ ఎక్క ॥

పరమమగు వేదాంత పఠన దొరికియు సదా
హరిభక్తిలేని సన్యాసి కంటె
సరవిమాలిన యంత్య జాతికులజుఁడైన
నరసి విష్ణుని వెదకు నాతఁడే ఘనుఁడు ॥ ఎక్క ॥

వినియుఁ జదివియును శ్రీవిభుని దాసుఁడు గాక
తనువు వేఁపుచునుండు తపసి కంటె
యెనలేని శ్రీవేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతఁ డప్పుడే ఘనుఁడు

అని వ్యాఖ్యానించగా, వేమన యోగి ఏమంటున్నాడో పరిశీలిద్దాం

"జాతులందు మిగుల జాతి ఏదెక్కువో
ఎరుకలేక తిరుగ ఏమి ఫలము
ఎరుక గలుగువాడె హెచ్చైన కులజుఁడు
విశ్వదాభి రామ వినుర వేమ"

అని ఎరుక (విజ్ఞానం) కలిగిన వాడే హెచ్చైన కులజునిగా వేమన్న కూడ నిర్ణయించాడు.

ఇలాగే ఈ ఇర్వురు మహనీయులు కులగోత్రాలను కుండ బద్దలు గొట్టినంత తీవ్రంగా నిరసించారు. చూడండి

ఏమి చెప్పేదిది యీశ్వర మాయలు
దీము ప్రతిమకును త్రిజగము గలిగె ॥ పల్లవి ॥

మల మూత్రంబుల మాంసపు ముద్దకు
కులగోత్రంబుల గుటి గలిగె
తొలులు తొమ్మిదగు తోలుదిత్తికిని
పిలువఁగఁ బేరునుఁ బెంపునుఁ గలిగె ॥ ఏమి ॥

నెత్తురు నెమ్ముల నీరు బుగ్గకును
హత్తిన కర్మము లటు గలిగె
కొత్తవెంట్రుకల గుబురుల గంతికి
బొత్తుల సంసార భోగము గలిగె ॥ ఏమి ॥

నానాముఖముల నరముల పిడుచకు
పూనిన సిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీ వేంకటాధిపుఁ దేలగఁ
దీనికిఁ బ్రాణము తిరుముగఁ గలిగె ॥ ఏమి ॥

మరోచోట అన్నమాచార్యులు

అచ్చుతు శరణమే అన్నిటికిని గురి
హెచ్చుకుందు మరి యెంచఁగ నేది

యోని జనకమగు యొడలిది
యే నెలపైనా నేఁటి కులము
తానును మలమూత్రపుఁ జెలమ
నానాచారము నడచీనా

ఇక వేమన్న కూడ

తొమ్మిది కంతల తిత్తికి
నిమ్మగు సొమ్ములును కులము లేటికి చెపుమా
నమ్మకు దేహము నాదని
బమ్మము నేననుచు తెలసి పలుకర వేమా!

అని కులగోత్రాలను ఈసడించు కొన్నాడు

## అంటు - ముట్టు

అశాశ్వతమైన ఈ మానవ శరీరము నవరంధ్రాల మురికి కొంప. ఆత్మ యొక్కటే శాశ్వతమైనది. ఈ విషయము నిత్యమూ చూస్తూకూడ అజ్ఞానులు కొందరు "మీరు మమ్ములను ముట్టక్కడి మీరు అంటు" అని కొందరిని ఈసడిస్తుంటారు. ఇలాంటి వారిని, ఇలాంటి భావాల్ని ఈ కవి యోగులిర్వురూ ఎనాడో తీవ్రంగా నిరసించి అస్పృశ్యతా నివారణకై కృషి చేశారు.

పరమాత్ముం డొక్కడే పరమ పావనుండు గన
పరిపూర్ణుం డనెడి యీ భావమేచాలు

హేయమిందే దుపాదేయ మిందేది
బాయిటనే హరి సర్వపరిపూర్ణుండు
సేయునెడ గుణభావజీవ కల్పనము లివి
రోయం జూచినం దనదు కాయమే రోంత ॥ పర ॥

జాతియిందే దంత్యజాతి యిందేది
జాతులిన్నిటా నాత్మ సర్వేశుండు
ఆతలను అంటుముట్టనెడు భావనలెల్ల
బాంకిపడి యెఱంగనో వని వెలితే తనది

తెలివి గలదాంకాం దెగనిమఱంగు లివి
తెలిసినంతటి మీందదిరు సంశయము

యిలలోన శ్రీవేంకటేశ్వరుని కరుణచే
వెలసి యీ జ్ఞానంబు విడువకు మనసా

అధ్యాత్మకవియోగి అయిన వేమన కూడ ఇలా వక్కాణిస్తున్నాడు.

ముట్టు ముట్టునుచును ముట్ట రాదందురు
ముట్టుకు దరియేమి మూలమేమి
నవబిలముల మురికి నరుల కందరకును
పుట్టగానె పుట్టుముట్టు వేమ

అలాగే ఇంకోచోట వేమన

మాలవాని నంటిమరి నీళ్ల మునిగేరు
మనుజ కర్మచేత మాలడయ్యె
నేల దెలియలేరొ యీ నర పశువులు
విశ్వదాభి రామ వినుర వేమ

అని అంటరాని తనాన్ని నిశితంగా విమర్శించాడు. అంతేకాదు

మాలవాని నేల మహిమీద నిందింప
నొడల రక్తమాంస మొకటి కాదొ?
వానిలోన మెలగు వానికులం బేది
విశ్వదాభి రామ వినుర వేమ

అని మానవతా వాదమును చేసి ఇంకా ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు వేమన యోగి

మాలవాడైనను మరి యాత్మ మీదను
మనసు నిలిపెనేని మాలగాడు
మనసు నిలుపకున్న మహిమీద మాలడు
విశ్వదాభి రామ వినుర వేమ

పరమ వైష్ణవాగ్రేసరుడైన తాళ్లపాక అన్నమాచార్యులు కూడ అంటరాని తనాన్ని నిరసిస్తూ హీనాధికములు లేవు. అందరిలో నెలకొన్న పరబ్రహ్మస్వరూపం ఒక్కటే. అందరికీ శ్రీహరే అంతరాత్మ అని అంటూ ఇలా భాష్యం చెపుతున్నాడు.

తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన
బ్రహ్మమొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మమొకటె పరబ్రహ్మ మొకటె ॥ తంద ॥

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥ తంద ॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటె
అండనే బంటు నిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁడుండేటి సరిభూమి యొకటె ॥ తంద ॥

అనుగు దేవతలకును అల కామసుఖ మొకటె
ఘనకీట పశువులకు కామసుఖ మొకటె
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుఁబేదకును నొక్కటే అవియు ॥ తంద ॥

కొంలి శిష్టాన్నములు గొనునాఁక లొకటే
తిరుగు దుష్టాన్నములు దినునాఁక లొకటే
వరగ దుర్గంధముల పై వాయువు నొకటే
వరుసఁ బరిమళముపై వాయువు నొకటే ॥ తంద ॥

కడఁగి యేనుఁగు మీఁద గాయు యొండొకటి
పుడమి శుకనము మీఁద బొలయు నెండొకటే
కడుఁబుణ్యులను పాప కర్ములను సరిగాన
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే ॥ తంద ॥

## వెఱ్ఱితనము

అమాయకంగా, పరధ్యానంలో, పిచ్చిగా కనబడు వారిని వెఱ్ఱివారని అంటారు. కానిమన ప్రజాకవులు అన్నమయ్య వేమన్న లేమంటారో తెలుసా? భగవంతుని ధ్యాసే లేక అశాశ్వతమైన ఈబాహ్య ప్రపంచమే స్థిరమైనదని, తలస్తూ దాన్లో మునిగి తేలేవారే అసలైన వెఱ్ఱివారు అని విమర్శించారు.

### బౌళి

వెఱ్ఱివాఁడు వెఱ్ఱిగాఁడు విష్ణుని దాస్యము లేక
విఱ్ఱవీఁగే యహంకారి వెఱ్ఱివాఁడు ॥ పల్లవి ॥

నాలుకపై శ్రీహరినామ మిట్టే వుండఁగాను
జోలితో మఱచిన నీచుఁడే వెఱ్ఱివాఁడు
అలరి యీ జగమెల్లా హరిరూపై వుండఁగాను
వాలి తలపోయలేని వాఁడు వెఱ్ఱివాఁడు ॥ వెఱ్ఱి ॥

కూరిమి బ్రహ్మాండాలు కుక్షినున్న హరికంటె
కోరివేరే కలఁడనే కుమతి వెఱివాఁడు
చేరి తన ఆత్మలోన శ్రీరమణుఁడుండఁగాను
దూరమై తిరుగువాఁడే దొడ్డ వెఱ్ఱివాఁడు ॥ వెఱ్ఱి ॥

సారపు శ్రీవేంకటేశు శరణాగతి వుండఁగా
సారెఁ గర్మము అంటెడి జడుడు వెఱ్ఱివాఁడు
చేరువ నాతని ముద్ర చెల్లుబడి నుండఁగా
మోరతోపై వున్నవాఁడే ముందు వెఱివాఁడు ॥ వెఱ్ఱి ॥

అని అన్నమాచార్యులు 'వెట్టివాణ్ని' గూర్చి వివరించగా ఇంచుమించు ఇదే విధంగా వేమన్న కూడా

ప్రతుకు నిత్యమనుచు పదురుచు వగమీర
విఱ్ఱవీగు వారు వెట్టివారు
ప్రాణులెల్ల యముని బారి గొఱ్ఱెలు సుమీ
విశ్వదాభి రామ వినుర వేమ

తనువులోన నున్న తత్త్వంబు తెలియక
వేరె యాత్రబోవు వెట్టివాడు
గంత మోసి మోసి గాడిద తిరగదా
విశ్వదాభి రామ వినుర వేమ

అని వాఖ్యానించాడు.

## యోగి

ఎలాంటి వాడు యోగి అనబడతాడు. యోగుల్లో పరమ యోగులెవరు? అను ప్రశ్నలకు సమాధానంగా వేదాంత కవులైన అన్నమయ్య వేమన్న లిరువురు ఇలా వివరించారు.

వాసి వంతు విడిచిన వాఁడే యోగి యీ
ఆసలెల్లా విడిచిన అతఁడే యోగి ॥ పల్లవి ॥

గద్దించి పారెడు తురగము వంటి మనసు
వద్దని మరలించిన వాఁడే యోగి
వొద్దనే కొండలవంటి వున్నత దేహగుణాలు
దిద్ది ముట్టుపెటు వాఁడే ధీరుఁడైన యోగి

ముంచుకొన్న యింద్రియపు మోహ జలధిలోన
వంచన మునుఁగ నట్టివాడే యోగి
పెంచి పుణ్యపాపములు పొట్టువంటి కర్మములు
దంచి పారఁజల్లు వాఁడే అత్త్వమైన యోగి ॥ వాసి ॥

వెగటు కామాదుల వెళ్లఁగొట్టి శాంతుడై
వగలుడిగిన యట్టి వాఁడే యోగి
నిగిడి శ్రీవేంకటపతి నిజదాసుఁడై భక్తి
దగిలి నిలుపువాఁడే ధన్యుఁడైన యోగి ॥ వాసి ॥

అని అన్నమాచార్యులు "యోగి" ని గూర్చి వివరించగా వేమన ఇలా వివరిస్తున్నాడు.

మనసులో నున్న మమత లన్నియు గోసి
దృఢము జేసి మనసుదేట పరచి
ఘటము నిల్పువాడు ఘనతర యోగిరా
విశ్వదాభి రామ వినుర వేమ

శాంత మానసమున జల్లనై శీతల
భాతి నున్నవాడు పరమయోగి
యట్టివాడు ముక్తి నతివేగ గైకొని
విశ్వదాభి రామ వినుర వేమ

అంతేగాక ఇంద్రియాలను అణచి పెట్టిన వాడే యోగి అని అంటూ ఇలాగ

ఆరుగురిని జంపి హరుమీది ధ్యానంబు
నిలిపి నిశ్చలముగ సెగడి యాత్మ
నతని యొకని సేయునాతడే యోగిరా
విశ్వదాభి రామ వినుర వేమ

లోను బయలుజేసి లోకంబు దెగటార్చి
కులము గాలబెట్టి గుణము వదలి
చింతలోని చింతజేరిన యోగిరా
విశ్వదాభి రామ వినుర వేమ

అని వివరిస్తూ వేమన చివరగా

నాసికంబు నడుమ నలిజూచు యోగికి
వాసివన్నె లేదు వసుధలోన
కాశినాధునైన గనగల డాయోగి
విశ్వదాభి రామ వినుర వేమ

పగలు రేయు జూడ భావంబు లోపల
దాను నేను యనెడు తలపు మరచి
యున్నయట్టి యతడు యుత్తమ యోగిరా
విశ్వదాభి రామ వినుర వేమ

అని యోగి లక్షణాలను వివరించాడు.

అలాగే ఈ మహాకవు లిద్దరి సాహిత్యాన్ని పరిశీలిస్తూ పోతే ఇద్దరి కవితల్లో ఎన్నో సాదృశ్యాలు, ఎంతో సామ్యం కనపడతాయి. కారణం వీరిద్దరూ రాయలసీమ ప్రాంతం కవులుపై పెచ్చు ప్రజాకవులు. వీరిద్దరి సాహిత్యంలో రాయలసీమ వ్యవహారంలోని మాటలే కనపడతాయి. ఉదాహరణకు ఇద్దరిలో ఒకే రకమైన అలంకారాలు కనపడతాయి.

## అలంకారాలు - పోలికలు

తాళ్లపాక అన్నమాచార్యులు విషయాన్ని చెప్పే టప్పుడు ఒక చోట ఇలా అంటాడు.

ఖారమైన వేంపమాను పాలువోసి పెంచినాను
తీరని చేఁదేకాక తియ్యనుండీనా

అదే ఉపమానంతో వేమన్న ఇలా గంటాడు

"వేము పాలుబోసి వెయ్యేండ్లు బెంచిన
చేదు విడిచి తీపి జెందనటుల"

ఇంకోచోట మరొక ఉపమానంతో అన్నచార్యులు ఇలా వక్కాణిస్తున్నాడు.

"పరుసమొక్కటే కాదా పయిడిగా జేసేది
అరయ లోహమెట్టున్నా నందు కేమి"

ఇదే ఉపమానం వేమన్నలోకూడా మనం గమనింపవచ్చు.

"పరుస మినుము సోకి బంగార మైనట్లు"

ఒకచోట అన్నమాచార్యులు అప్పు చేయడం, అప్పు ఇవ్వడం చాలా రోత అనీ, అది కూడనిపని అని ఇలా బోధిస్తాడు.

"అప్పులేని సంసారమైన పాటే చాలు
అప్పులేని జీత మొక్కతారమైన జాలు"

ఇక వేమన్న కూడ

"అప్పు లేనివాడు అధిక బలుడు" అనీ,
"అప్పుదీయ రోత హరిహరాదులకైన" అని

అప్పును గూర్చి ఈసడించుకొన్నాడు.

ఇద్దరి భార్యల సంసారంలో లెస్సగా అనుభవించి సుఖించిన తాళ్ళపాక అన్నమాచార్యులు

"సంసారమే మేలు సకల జనులకు"

అని గృహస్థాశ్రమ ధర్మాన్ని శ్రేష్ఠమైనదిగా చెప్పాడు.
వేమన్న కూడా

"స్వర్గమేటికయ్య సంసారి కింకను"

సంసారికి ఇంకొక స్వర్గమే అక్కరలేదు అని కొనియాడినాడు.

మోక్షాసక్తిని గూర్చి చెప్పుతూ అన్నమయ్య సంసార సుఖాల్ని బాగా అనుభవించిన తరువాతే మోక్షం వైపు మనసు మరులుతుంది అన్న అభిప్రాయాన్ని ఇలా స్పష్టం చేస్తున్నాడు.

"కందువ సంసారియైన గాని మోక్షము గోరదు"

వేమనకూడా సరేసరి. అదే అభిప్రాయాన్ని అలాగే వ్యక్తీకరిస్తున్నాడు.

"కామిగానివాడు మోక్షకామి కాడు"

అలాగే వీరిద్దరి సాహిత్యంలో రాయలసీమ వ్యవహారంలోనున్న పదాలు నానుళ్ళు, పలుకుబళ్ళు కనపడతాయి. ఉదాహరణకు

బిత్తరి, బిత్తలి అను పదాల్ని దిగంబరి అన్న అర్థంలో ఇద్దరు వాడతారు అట్లే కడి అన్నముద్దకే 'కడి' అని రాయలసీమ వ్యవహారం.

"నెక్కొన మింగిన కడి నిజమో కల్లో"

అని అన్నమయ్య ప్రయోగం. కాగా

"కంటకమున తిన్న కడి గండమై వచ్చు"

అని వేమన్న ప్రయోగం. అట్లే వీరి ప్రయోగంలో "ఎడ్డె, అడిగెండ్లు మలిగెండ్లు, కావరము, కసవు, కసువు, ఓలి," కానవచ్చు మున్నగు అనేక పదాలు నేటికి రాయలసీమ వ్యవహారంలో నిలిచి వున్నాయి.

( ఇలాగ పరిశీలిస్తూ పోతే అభ్యుదయ మానవతావాదులైన ఈ కవియోగులిరువురి కవితలో, భాషలో, భావాల్లో ఎన్నో సాదృశ్యాలు మరెన్నో పోకడల్లో పోలికలు సుస్పష్టంగా గోచరిస్తాయి.

సంఘ సంస్కర్తలైన అన్నమయ్య, వేమన లిరువురు ఆంధ్ర దేశమంతటా పల్లెపల్లెకు, వాడవాడకు తిరిగారు. తెలుగునాట ముఖ్యంగా రాయలసీమ ప్రజలలో నానుతున్న నుళ్లనూ, నానుళ్లనూ, జాతీయాలనూ పలుకుబళ్లనూ, భావాలనూ నిశతంగా గమనించి వాటిని స్వీకరించారు. ఆ ప్రజా జీవన స్రవంతితో తామూ తాదాత్మ్యం చెంది అనుభవించారు. ఆనందించారు. ఆయా సన్నివేశాలలో లోకులు మైమరచి సహజమైన

ధోరణిలో వూసులాడుకున్న సుందరమైన సున్నితమైన సునిశితమైన తేటతెలుగు మాటలను విన్నారు. ఆ తెలుగు గొంతుల్లో మోగుతున్న గేయరీతులను విన్నారు. కన్నారు, రచించారు. యావత్ ప్రజలను ఆకట్టుకున్నారు. ఆకర్షించుకున్నారు. తమ సాహిత్యం ద్వారా ప్రజలను అభ్యుదయ పథంవైపు పురోగమింప జేశారు. కనుకనే ఈ చైతన్యమూర్తు లిరువురూ వాసిలో రాశిలో ససిచక్కనైన ప్రజాకవులుగా వర్ధిల్లినారు.

# దేసాళం

ఈతడే ముక్తిదోవ యీతడే మాయాచార్యు
డీతడు గలుగబట్టి యిందరు బతికిరి ॥పల్లవి॥

అదివో తాళ్ళపాక అన్నమాచార్యులు
యిదెవీడె శ్రీ వేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి
పదములుసేసి పాడి పావనము సేసెను ॥ఈతడే॥

అలరుచు దాళ్ళపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీ వేంకటనిధియై తానై
కలి దోషములు వాప ఘనపురాణములెల్ల
వలుకుల నించి నించి పాడినాడు హరిని ॥ఈతడే॥

అంగవించె దాళ్ళపాక అన్నమాచార్యులు
బంగారు శ్రీ వేంకటేశు పాదములందు
రంగుమీర శ్రీ వేంకటరమణుని యలమేలు
మంగను ఇద్దరిఁ బాడి మమ్ము గరుణించెను ॥ఈతడే॥

వేమననగ యోగి వెలసె లోకములోన
పూజలిడుడు పుణ్య పురుషులార
పూజలిడిన యంత భుక్తి ముక్తుల నిచ్చు
విశ్వదాభిరామ వినుర వేమ

# పోలికలు గల గేయాలు

## శ్రీరాగం

కాకున్న సంసార గతు లేల?
లోక కంటకములగు లోభంబు లేల?

వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి
వినికి చేసిననదియె - వేదాంత బోధ
మనికి గనవలసినను మధువైరిపై భక్తి
యునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు ॥కాకున్న॥

చదువు గనవలససినను శౌరినామము దిరుగ
జదువుటే సకల శాస్త్రముల సమ్మతము
నిదుర గనవలసినను నీరజాక్షునికి దన
హృదయ మర్పణసేయు టిది యోగనిదుర ॥కాకున్న॥

ఆస వలసిన వేంకటాధీశ్వరుని కృపకు
నాస సేయుటె వరమానంద సుఖము
వాసి గనవలసినను వైష్ణవాగారంబు
వాసి సేయుట దనకు వైభవ స్ఫురణ॥ (అన్నమయ్య)

చెవులు గోరును మంచి జిలి బిలి పాటల
తియ్యని మాటల తెరగు వినగ
చర్మంబు గోరును సరవి తోడుత శీత
మృదుల సంస్పర్శ సంపదల నెపుడు
కన్నులు గోరును కమనీయ వర్ణంబు
లైనట్టి రూపంబు లనువుతోడ

నాలుక గోరును నయము తోడుత
యొగరు కారమ్ము చేదుప్పు పులుసు

ముక్కుగోరును సద్గంధములను జెలగి
చెవులు చర్మంబు కన్నులు జిహ్వ ముక్కు
నిన్నియును గూడి నటువంటి యిల్లురోసి
తన్ను గనుగొని సుఖియింప దగును వేమ (వేమన్న)

## దేవగాంధారి

ఘోరమైన వేఁపమాను పాలువోసి పెంచినాను
తీరని చేఁదేకాక - తియ్యనుండీనా

పాయదీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి
చాయకెంత గట్టినాను చక్క నుండీనా
కాయపు వికారమది కలకాలముఁ జెప్పినా
పోయిన పోకలే కాక బుద్ధి వినీనా ॥ ఘోర ॥

ముంచి ముంచి నీటిలోన మూలనానఁ బెట్టుకొన్నా
మించిన గొడ్డలి నేఁడు మెత్తనయ్యీనా
పంచమహా పాతకాల బారిబడ్డ చిత్తమిది
దంచి దంచి చెప్పినాను - తాఁకి వంగీనా ॥ ఘోర ॥

కూరిమితోఁ దేలుఁదెచ్చి కోకలోన బెట్టుకొన్నా
సారె సారెఁ గుట్టుగాక చక్కనుండీనా
వేరులేని మహిమల వేంకటవిభుని కృప
ఘోరమైన ఆసమేలు - కొరసోకీనా ॥ఘోర॥

(అన్నమయ్య)

వేము పాలుబోసి వెయ్యేండ్లు బెంచిన
చేదు విడిచి తీపి జెందనటుల

నోగు గుణము విడిచి యుచితజ్ఞుడగు నెట్లు
విశ్వదాభి రామ వినుర వేమ

కుక్కతోక దెచ్చి గొట్టంబు జేర్చిన
క్రోవి చెంతనుండు కొంత తడవు
యెంతజెప్ప చెడుగు పంతంబు మానునా
విశ్వదాభి రామ వినుర వేమ

## నాట

ఎవ్వరెవ్వరి వాఁడొ - యీ జీవుఁడు చూడ
నెవ్వరికి నేమౌనో యీ జీవుఁడు ॥ పల్లవి ॥

ఎందరికిఁ గొడుకు గాఁడీ జీవుఁడు వెనక
కెందరికిఁ దోబుట్టఁ డీజీవుఁడు
ఎందరిని భ్రమయించఁడీ జీవుఁడు దుఃఖ
మెందరికిఁ గావింపఁడీ జీవుఁడు ॥ ఎవ్వ ॥

ఎన్నఁడును జేటులే నీ జీవుఁడు వెనక
కెన్ని తనువులు మోవఁడీ జీవుఁడు
ఎన్నఁగల తిరువేంకటేశు మాయలఁ దగిలి
యెన్ని పదవులఁ బొందఁడీ జీవుఁడు ॥ ఎవ్వ ॥

(అన్నమయ్య)

సుతులు సతులు మాయ సుఖ దుఃఖములు మాయ
సంసృతియును మాయ జాలిమాయ
మాయు బ్రతుకు కింత మాయ గప్పిస్త్రివి
విశ్వదాభి రామ వినుర వేమ

బ్రతుకు టెల్లమాయ భవబంధములు మాయ
తెలివి మాయ తన్ను దెలియ మాయ
మాయ దెలియు వాడు మర్మజ్ఞుడగు యోగి
విశ్వదాభి రామ విమర వేమ

# గుండక్రియ

కడుపెంత తాఁగుడుచు కుడుపెంత దీనికై
పడని పాటుల నెల్లఁ బడి పొరల నేలా ॥ పల్లవి ॥

పరుల మనసునకు నాపదలు గలుగఁగ జేయు
పరితాప కరమైన బ్రదుకేలా
సొరిది నితరుల మేలు చూచి సైపఁగ లేక
తిరుగు చుండెడి కష్ట దేహమిది యేలా ॥ కడు ॥

ఎదిరి కెప్పుడుఁ జేయు హితమెల్లఁ దనదనుచు
చదివి చెప్పని యట్టి చదువేలా
పొదిగొన్న యాసలోఁ బుంగుడై సతతంబు
పదమదంబై పడయు చవులు దనకేలా ॥ కడు ॥

శ్రీ వేంకటేశ్వరుని సేవారతికిఁ గాక
జీవన భ్రాంతిపడు సిరులేలా
దేవోత్తముని నాత్మఁ దెలియు నొల్లక పెక్కు
త్రోవలేగిన దేవి దొరతనం బేలా ॥కడు॥ (అన్నమయ్య)

కడుపు కేల మనస! కళవళ పడియెదు
కడుపు కేల దృప్తి కలుగు చుండు
కడుపు రాతిలోన కప్పకుఁ గలుగదా
విశ్వదాభి రామ వినుర వేమ

చదివి చదివి చదివి చావంగ నేటికి
చావులేని చదువు చదువ వలయు
చదువు లేక కోటి జనులు నచ్చిరి గదా
విశ్వదాభి రామ వినుర వేమ (వేమన్న

## సామంతం

మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అను ధినమును దుఃఖమంద నేలా ॥ పల్లవి ॥

జుట్టెడు గడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెడు గూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి
వట్టి లంపటము వదల నేరఁడు గాన ॥ మను ॥

అందరిలోఁ బుట్టి అందరిలోఁ బెరి
గందరి రూపము లటుదానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించు
అందించి పదమందె నటుగాన ॥మను॥ (అన్నమయ్య)

## గుండక్రియ

మానుషము గాదు మఱి దైవికము గాని
రానున్నా అది రాకుమన్నఁ బోదు ॥ పల్లవి ॥

అను భవనకుఁ బ్రాప్తమైనది
తనకుఁ దానె వచ్చి తగిలికాని పోదు మాను

తిరువేంకటగిరి దేవుని
కరుణచేతఁ గాని కలుష మింతయుఁ బోదు ॥మాను॥
(అన్నమయ్య)

ప్రాప్తి గలుగు చోట ఫలమిచ్చు దైవంబు
ప్రాప్తి లేని చోట ఫలము లేదు
ప్రాప్తి లేక పసిఁడి వరమాత్మఁ డిచ్చునా
విశ్వదాభి రామ వినుర వేమ (వేమన్న)

# సామంతం

దివమట రాతిరట తీరుచున్నదా
కవగూడఁ బాయఁ గాక కాణాచి వున్నదా ॥ పల్లవి ॥

మానుష జన్మమట మలమూత్ర దేహమట
సోఁకల హేయమే కాక శుద్ధి వున్నదా
మానని కోరికలట మాయల నంసార మట
దీనవృత్తే కాక యిందుఁ దేజమున్నదా ॥ దివ ॥

చంచలపుఁ జిత్తమట సకలేంద్రియములట
బొంచిన పాపమే కాక పుణ్యమున్నదా
సంచితపుఁ గర్మమట జననలయములట
ముంచిన తీదేపే కాక మోదమున్నదా ॥ దివ ॥

శ్రీ వేంకటేశుఁడట జీవుఁడ నేనలు యిందు
దైవపు దాస్యమే కాకితర మున్నదా
యీవల నావల నట యిహముంబరము నట
కైవశము లాయుగాక కడమున్నదా ॥దివ॥ అన్నమయ్య

# ధన్నాసి

అక్కడ నెక్కడి నరకము అమాటే కల్లా
దిక్కులనిండె యిన్నియు దీరుచుకొంటిమయ్య ॥పల్లవి॥

తనువిది మల మూత్రంబుల దాకొని యుండిన పట్నము
దినదినము హెచ్చిచ్చిష్టపు దిడ్డం దూరెడము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడు గుంతలు
మని మని నరకము చొచ్చిన మనుజుల వేడెన నేము

మదన జలంబుల కాలువ మా పెద్దల పూరంబులు
పొడలిన పుత్రుల యిసిళ్ల పుట్టలు వెట్టిదము

యెదుటనె సంసారంబులు యెదయని కారాగృహములు
మది మది నరకము చవిగొను మనుజుల మిదె నేము
॥ అక్క ॥

పుట్టినదే నగ్నత్వము బూతో బండో యెరగము
చిట్టంట్ల వాచవులగు జీవుల మ్రింగెదము
నెట్టన శ్రీ వేంకటేశ్వర నీతో గూడఁగ జగములు
మట్టిన చోటి మట్టి మనుజుల మిదె నేము ॥అక్క॥

## శంకరాభరణం

అచ్చుతు శరణమే అన్నిటికి గురి
హెచ్చు కుందు మరి యెంచఁగ నేది ॥ పల్లవి ॥

యోని జనకమగు యొడలిది
యే నెలవైనా నేఁటి కులము
తాను మల మూత్రపుఁ జెలమ
నానా చారము నడచీనా ॥ అచ్చు ॥

పాప పుణ్యముల బదు కిది
యే పొద్దు మోక్షం బెటువలె దొరకు
దీపన బాధల దినము లివి
చూపట్టి వెదకఁగ సుఖ మిందేది ॥ అచ్చు ॥

మరిగిన తెరువుల మనసు యిది
సరవి నెన్న విజ్ఞానం బేది
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁడే
వెరవని కంటే వెలితిఁక నేది ॥అచ్చు॥ అన్నమయ్య

మురికిలోనఁ బుట్టి మురికిలోన బెరిగి
మురికి తనువు కింత మురిమేకుల
మురికెరుంగు నతఁడు మురికిలోఁ బుట్టునా
విశ్వదాభి రామ వినుర వేమ

ఉచ్చలోనె పుట్టి యుచ్చలోనె పెరిగి
యుచ్చకాస పడగ యుచిత మగునె?
యుచ్చ రోయువాఁడె యుత్తమ యోగిరా
విశ్వదాభి రామ వినుర వేమ

మురికి కొంపలోన నిరికించి జీవుని
గర్మ పాశములను గట్టివేసి
నిట్టి కర్మజీవి కెట్లాకో మోక్షంబు?
విశ్వదాభి రామ వినుర వేమ

మురికి తోలు కంత మూలంబె మదిచింత
నరక మబ్బుఁ జెంత నలుగుడెంత
పరము గోరినంత బయులగు నీవింత
విశ్వదాభి రామ వినుర వేమ

## సాళంగనాట

భవరోగ వైద్యుఁడవు పాటించనీ వొకఁడవే
నవనీత చోర నీకు నమో నమో

అతివలనెడి సర్పాలఁ ధరాలు గఱచిన
తతి మదన విషాలు తలకెక్కెను
మితిలేని రతులఁ దిమ్మరి వట్టె దేహాలు
మతి మరచె నిందుకు మందేదొకో

కాలఁతు లనెడి మహా భూతాలు సోఁకిన
తలమొలలు విడి బిత్తరులై యున్నారు
అలరు చెనకులచే నంగములు జీరలాయ
మలసి యిందుకు నిఁక మంత్ర మేదొకో ॥ భవ ॥

తరుణుల కౌఁగిలనే తాప జ్వరాలు వట్టి
కరఁగి మేనెల్ల ధిగఁ గారఁ జొచ్చెను
నిరతి శ్రీవేంకటేశ నీవే లోకులకు దిక్కు
అరుదు సుఖాన నుండే యంత్ర మేదాకో ॥భవ॥
(అన్నమయ్య)

## రామక్రియ

ముందే తొలఁగ వలె మోసపోక సంగమెల్ల
కందుప బోయిన నీళ్లు కట్టగట్ట వచ్చునా ॥ పల్లవి ॥

అనలముఁ బొడగయే నందనున్న మిడతలు
పనిలేకున్నా నందుఁబడ కుండీనా
హానిగి చెలులఁ గంటే పురుషుల చూపులెల్లా
ననిశము నందు మీఁద నంటఁ బారకుండునా ॥ముందే॥

గాల పుటెఱ్ఱలఁ గంటే కమ్మి నీటిలో మీలు
జాలి నావసలఁ జిక్క చావ కుండీనా
ఆలరి బంగారు గంటే నందరి మనసులూను
పోలిమి నావసఁ జిక్కి పుంగుడుగాఁ కుండునా ॥ముందే॥

చేరి ముత్యపుఁ జిప్పల చినుకులునిఁ నిచితే
మేర తేట ముత్యములై మించ కుండీనా
ధారుణి శ్రీవేంకటేశు దాసుల సంగతి నుంటే
పోరచి నేజీవులైనఁ బుణ్యులుగా కుండురా ॥ముందే॥
(అన్నమయ్య)

అధర సుధను జూచి యన్నియు మఱచు
దరుణి రూపుఁ జూచి తన్ను మఱచు
నుక్తు లాలకించి యోగంబు మఱచురా
విశ్వదాభి రామ వినుర వేమ

ఆడువారిఁ గన్న నర్థంబు బొడఁగన్న
సారమైన రుచుల చవులుగన్న
అయ గారికైన నాశలు గలుగవా
విశ్వదాభి రామ వినుర వేమ

కాంచనంబుపైన గాంతల పైనను
బ్రహ్మకైనఁ బుట్టు రిమ్మతెగులు
తోయ జాక్షి విడుచు దొరయెవ్వఁడును లేదు
విశ్వదాభి రామ వినుర వేమ

ఇంతిఁ జూచె నేని యింతింత యనరాదు
కాలవహ్ని లక్క గరఁగినట్లు
వట్టి మోహమిట్టు రట్టుం జేయురా
విశ్వదాభి రామ వినుర వేమ.

ఆలు బిడ్డలనుచు నతి మోహమున నున్న
ధనము మీఁద వాంఛ తగిలియున్న
నట్టి నరుల కెల్ల నవని ముక్తియె లేదు
విశ్వదాభి రామ వినుర లేమ

తలఁప వేద శాస్త్రములు గానక
అలరుచు వాల్మీ కాదులు
తలకొని హరి మంత్రమే దగఁ బేర్కొని
అలవి మీరఁ గడు నధికములైరి ॥ (అన్నమయ్య)

రామనామ పఠనచే మహి వాల్మీకి
వరగ బోయ యయ్యు బాపడయ్యె
కులము ఘనము గాదు గుణము ఘనంబురా
విశ్వదాభి రామ వినుర వేమ

ఆస లఁనియెడి తాళ్ల సంట గట్టుక
విధికి నప్పగించితివి గదె కర్మమా
వాసి విడిచితిమి నీవార మైతిమి మమ్ము
వన్నె చెడనీకువో కర్మమా
కాసుకునుఁ గొరగాని గతిలేని పనికిఁగా
కాలూఁచనీ వేల కర్మమా
వోసరించొక మారు వొయ్యనే
వొకరీతి నొల్లనని తలఁగు మీ కర్మమా
(అన్నమయ్య)

ఆసలనెడి త్రాళ్ల నఖిల జంతువు లెల్ల
పట్టు వడును గాన నిట్టలమున
జ్ఞాన మనెడి చురియ బూని కోయఁగ రాదె
విశ్వదాభి రామ వినుర వేమ

ఆశ లనెడి త్రాళ్ల నమరఁ గోయఁగఁ జేసి
పారవైవ గాని పరము లేదు
కొక్కు తిండియాస జిక్కి చచ్చినట్లు
విశ్వదాభి రామ వినుర వేమ

తనువుఁ బ్రాయము నమ్మి దాన ధర్మము మాని
చెనటివై కర్మాలు సేసేవుగా
వొనరఁగ మీఁద నొడ్డిన మొగులు నమ్మి
దొనల నీళ్లు వెళ్ళఁ దోసేఁవుగా (అన్నమయ్య)

తనువు లస్థిరములు ధర్మము నిత్యము
చేయు ధర్మమెల్ల చెడని పదవి
కని విని మరియు తెలియ గనరు నరపశులు
విశ్వదాభి రామ వినుర వేమ

తనువు యెవరి సొమ్ము తనదని పోషింప
ధనము యెవరి సొమ్ము దాచుకొనగ
ప్రాణ మెవరి సొమ్ము పోయకుండగ నిల్ప
విశ్వదాభి రామ వినుర వేమ

పంచభూతాల తనువు పాటించి మోచితిఁ గాన
పంచేంద్రియ వికారాలు పాయవు నాకు
యెంచఁగ నీ దాస్యము నా కినా మిచ్చితి గాన
పంచల నాపుట్టుగు సఫల మాయ నిదివో (అన్నమయ్య)

ఏచిన పంచేంద్రియ సుఖ
నీచ వ్యాపార ముడిగి నిజముగ చాన్రై
లోచూపు జూడ నొల్లకె
వాచా బ్రహ్మంబు వదల వలదుర వేమా (వేమన్న)

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవే నేనై యుందుఁ జిలుకా
శ్రీ వేంకటాద్రిపై చిత్తములో నుండి
సేవించుకొని గట్టి చిలుకా (అన్నమయ్య)

నేనను వచనంబు నీవనగా వచ్చు
నీవు నేనబడదు నిష్ఠ దెలియ
నేను నీవె, నీవెనే ననవచ్చురా
విశ్వదాభి రామ వినుర వేమ

తన్నెరుగని వాడు తానె తానై యుండు
దన్నెరిగిన వాడు దానె తాను
తనువు లేని వాడు తానెతానౌ సుమా
విశ్వదాభి రామ వినుర వేమ (వేమన్న)

# శ్రీరాగం

కొంచెమున్న ఘనముఁ గనుఁగొన నేల హరిఁదలఁచు
పంచమహా పాతకుఁడే బ్రాహ్మణోత్తముడు ॥పల్లవి॥

వేదములు చదివియును విముఖుడై హరికథల
నాదరించని సోమయాజికంటె
యేదియును లేని కులహీనుఁడైనను విష్ణు
పాద సేవకుఁడవో బ్రాహ్మణోత్తముఁడు ॥కొంచె॥

పరమ మగు వేదాంత పఠన దొరకియు సదా
హరిఁ దలచఁలేని సన్యాసి కంటే
మరిగి పసురముఁ దినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముడు ॥కొంచె॥

వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృధా
తనువు వేఁపుచుఁ దిరుగు తపసి కంటె
చనవు గల వేంకటేశ్వరు దాసులకు వెంట
బని దిరుగు నధముఁడే బ్రాహ్మణోత్తముఁడు ॥కొంచె॥
(అన్నమయ్య)

మాల మేలు గుణము మంచిది కలిగిన
మాల కూడుఁ గుడుచు మనుజు కంటె
గుణమె మేలు కాని కులమేమి మేలురా?
విశ్వదాభి రామ వినుర వేమ

# సావంతం

ఎక్కువ కులజుఁడైన హీన కులజుఁడైన
నిక్క మెరిగిన మహా నిత్యుఁడే ఘనుడు

వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించని సోమయాజి కంటె
యేదియును లేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుడు ॥ఎక్క॥

పరమ మగు వేదాంత పఠన దొరికియు సదా
హరిభక్తి లేని సన్యాసి కంటె
సరవి మాలిన యంత్య జాతి కులజుఁడైన
నరసి విష్ణుని వెదకు నాఁతడే ఘనుడు ॥ఎక్క॥

వినిఁయు జదివియును శ్రీవిభుని దాసుఁడు గాక
తనువు వేఁపుచు నుండు తపిసి కంటె
యెనలేని శ్రీవేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతఁ డప్పుడే ఘనుడు ॥ఎక్క॥

మాల వాడయినను మరి యాత్మ మీదను
మనసు నిల్పనేని మాలగాడు
మనసు నిల్పకున్న మహిమీద మాలడు
విశ్వదాభి రామ వినుర వేమ

ఆభి జాత్యముననె యాయు వున్నంతకుఁ
దిరుగు చుంద్రు భ్రమలఁ దెలియ లేక
ముఱికి భాండముననుముసరు నీగల రీతి
విశ్వదాభి రామ వినుర వేమ

## శ్రీరాగం

ఏమి చెప్పె దిది యీశ్వరమాయలు
దీము ప్రతిమకును త్రిజగము గలిగె

మలమూత్రంబుల మాంసపు ముద్దకు
కుల గోత్రంబుల గురి గలిగె
తోలులు తొమ్మిదగు తోలు దిత్తికిని
పిలువంగఁ బేరునుఁ బెంపునుఁ గలిగె ॥ఏమి॥

నెత్తురు నెమ్ముల నీరు బుగ్గకును
హత్తిన కర్మము లటుగలిగె
కొత్త వెంట్రుకల గుబురుల గంతికి
పొత్తుల సంసార భోగము గలిగె ॥ఏమి॥

నానా ముఖముల సరముల పిడుచకు
పూనిన సిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీవేంకటాధిపుఁ డేలంగ
దీనికిఁ బ్రాణము తిరముగఁ గలిగె (అన్నమయ్య)

తొమ్మిది కంతల తిత్తికి
నిమ్మగు సొమ్ములును కులము లేటికి చెపుమా?
నమ్మకు దేహము నాదని
బమ్మము నేననుచు తెలిసి పలుకర వేమా

## శుద్ధవసంతం

పరమాత్ముఁ డొక్కఁడే పరమ పావనుఁడు గన
పరిపూర్ణుఁ డనెడి యీ భావమే చాలు ॥పల్లవి॥

హేయ మిందే దుపాదేయ మిందేది
బాయిటనే హరి సర్వ వరిపూర్ణుఁడు
సేయునెడ గుణ భావ జీవ కల్పనము లివి
రోయఁ జూచినఁ దనదు కాయమే రోఁత ॥పర॥

జాతి యందే దంత్య జాతి యిందేది
జాతు లిన్నిటా నాత్మ సర్వేశుఁడు
ఆతలను అంటు ముట్టనెడి భావన లెల్ల
బాఁతి పడి యెఱఁగనో పనివెలితే తనది ॥పర॥

తెలివి గలదాఁకా దెగని మఱఁగు లివి
తెలిసి నంతటి మీఁద దీరు సంశయము
యిలలోన శ్రీవేంకటేశ్వరుని కరుణచే
వెలసి యీ జ్ఞానంబు విడువకు మనసా ॥పర॥

జాతు లందు మిగుల జాతి ఏదెక్కువో
ఎరుక లేక తిరుగ ఏమి ఫలము
ఎరుక గలుగు వాడె హెచ్చైన కులజుండు
విశ్వదాభి రామ వినుర వేమ ॥పర॥

## పాడి

వేదం బెవ్వని వెదకెడిని
ఆ దేవునిఁ గొనియాడుఁడీ ॥ పల్లవి ॥

అలరిన చైతన్యాత్మకుఁ డెవ్వడు
కలఁడెవ్వ డెచటఁ గలఁ డనిన
తలఁతు రెవ్వనిని, దను వియోగ దశ
యిల నాతన భజియించుఁడీ ॥ వేదం ॥

కడఁగి సకల రక్షకుఁ డిందెవ్వఁడు
వడి నింతయు నెవ్వనిమయము
పిడికిట తృప్తులు పితరు లెవ్వనిని
దడవిన ఘనుఁ డాతనిఁ గనుఁడీ ॥ వేదం ॥

కదిసి సకల లోకంబుల వారలు
యిదిలో కొలిచెద రెవ్వనిని
త్రిదశ వంద్యుఁడగు తిరువేంకటపతి
వెదకి వెదకి సేవించుఁడీ ॥ వేదం ॥

అందు నిందు నుందు నఖిలుందు చూడఁగా
నెందు దానె నిండి యెఱుఁగు చుండు
నతని పూజఫలము నందంగ వలెనయా
విశ్వదాభి రామ వినుర వేమ

# ఆధార గ్రంథములు


1. అన్నమయ్య అధ్యాత్మ శృంగార కీర్తన సంపుటములు
—తి.తి.దే. ప్రచురణములు

2. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము (పీఠిక)
—శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి

3. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర (ద్విపద)
—శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ

4. అన్నమయ్య సంకీర్తనామృతము I, II సంపుటాలు
—శ్రీ సముద్రాల లక్ష్మణయ్య

5. ప్రజాకవి వేమన్న (1980) —డా॥ ఎన్. గోపి

6. వేమన పద్యాలు (సి పి. బ్రౌన్ 1939 నాటి సంకలనం)
—బంగోరె

7. వేమన పద్య రత్నములు (1954)
—శ్రీ నేదునూరి గంగాధరం

8. "వేమన" వ్యాసం. చైతన్యలహరి - యువభారతి ప్రచురణ
—డా॥ మరుపూరి కోదండరామ రెడ్డి

9. 'ప్రజాకవులు అన్నమయ్య - వేమన' రేడియో ప్రసంగం
—జూలకంటి బాల సుబ్రహ్మణ్యం

10. తాళ్లపాక కవుల పద కవితలు - భాషా ప్రయోగ విశేషాలు
—డా॥ వేటూరి ఆనంద మూర్తి

11. "వేమన్న వేదం" వ్యాఖ్యానం —శ్రీ ఆరుద్ర

12. ప్రజాకవులు —డా॥ గంధం అప్పారావు

13. ప్రజాకవి వేమన యోగి —శ్రీ మరుపూరు కోదండరామ రెడ్డి

14. వేమన సూక్తులు (1977) —డా॥ చల్లా రాధాకృష్ణ వర్మ
లక్ష్మీ నారాయణ గ్రంథమాల-5
నాగార్జున నగర్, కోడంబాకం, మద్రాసు-24.

15. ఆంధ్రవాగ్గేయ కారుల చరిత్రము (1958)
—డా॥ బాలాంత్రపు రజనీ కాంతారావు
(విశాలాంధ్ర ప్రచురణ)

## ఇతర ముద్రిత రచనలు

1. అన్నమయ్య పదకవితల్లో రామకథ
2. శ్రీ వేంకటేశ్వరుడు - అన్నమయ్య
3. శ్రీ సత్యభామా విజయము (ద్విపద)-పరిష్కరణ. (ఘట్టు శేషకవి ప్రణీతము.)
4. సురాభాండ చరిత్ర (యక్షగానం) - పరిష్కరణ.

ఎన్నో వ్యాసాలు సప్తగిరి, భారతి, ఆంధ్రప్రభ పత్రికలలో ప్రచురణ. ఆకాశవాణి కడప కేంద్రం నుండి కొన్ని సాహిత్య ప్రసంగాల ప్రసారం.

## ముద్రణలో

1. బ్రహ్మాండ నాయకునకు బ్రహ్మపూజ.
2. అందరికి శ్రీహరే అంతరాత్మ (నాటిక).